Aruna Bhumi Telugu Daily
RNI APTEL/25/A1236
# అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు సంపుటి : 01 సంచిక : 345 ఎడిటర్ : ఆర్ చంద్రశేఖర్ రావు పేజీలు : 08, వెల రూ. 2 రూ/ మంగళవారం 02-06 - 2026



నువ్వు మేనేజ్‌మెంట్ కోటా..
రేవంత్ మెరిట్ కోటా

అరుణభూమి దినపత్రికకు
విలేఖరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా ప్రారంభించిన అరుణభూమి తెలుగు దినపత్రిక లో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.
సంప్రదించవలసిన నెంబర్
9989924749
7013007309

# పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

- అనుమతి నిరాకరించిన పోలీసులు
- హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ
- జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు
- 'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక
- ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ



**హైదరాబాద్ :**
హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. - మిగతా 2 లో



## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

- ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తామన్న టీజీపీఎస్సీ ఛైర్మన్
- 3,800 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతిచ్చిందని వెల్లడి
- కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు సూచన

**హైదరాబాద్ :**
నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన - మిగతా 2 లో

## కొత్త నాయకత్వం కోసం
# కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్



**హైదరాబాద్ :**
రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ - మిగతా 2 లో



## పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

- డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!
- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి
- పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న
- పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ - మిగతా 2 లో

## దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే
# అభివృద్ధి, సంక్షేమం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు
- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి
- ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీచేస్తే ఓర్వలేకపోయిందన్న సీఎం



**అమరావతి :**
'గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వరకు ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కుటుంబానికి దాదాపు 3, 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మహిళలకు 33% సీట్లు, ఉచితంగా 3 సిలిండర్లు: ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదిగేలా చేసేలా కృషి - మిగతా 2 లో

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ



- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## దేశంలో జల వనరుల నిర్వహణ కోసం
# ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్


- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్
- దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ
- అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు
- జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి




**ఢిల్లీ :**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి. డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక - మిగతా 2 లో

## ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై
# అమెరికా భీకరదాడులు

- కువైట్ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకున్న ఎయిర్ డిఫెన్స్
- ఇరు దేశాల దాడులతో 2 శాతం పెరిగిన చమురు ధరలు
- భూగర్భ క్షిపణి టన్నెళ్లను వేగంగా పునరుద్ధరిస్తున్న ఇరాన్



**ఢిల్లీ :**
మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేడెక్కాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా 'ఆత్మరక్షణ దాడులు' జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు - మిగతా 2 లో





## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- గీత కార్మికుల కష్టాలు తెలుసుకుని తాటికల్లు రుచిచూసిన సీఎం

## యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

- రూ.30 లక్షల కోట్లకు చేరువైన లావాదేవీల మొత్తం విలువ
- గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగిన లావాదేవీల సంఖ్య
- 8కి పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలు



# సంపాదకీయం

## కాలాతీత బాల్యం

'టామ్.' జవాబు లేదు. 'ఒరేయ్ టామ్.' పోలీ పెద్దమ్మ పిలుపునకు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఓ అని వినబడుతుంది. టామ్ అమెరికాలో మాత్రమే లేడుగా! వాడు ఆఫ్రికాలోనూ ఉన్నాడు, అనకాపల్లిలోనూ ఉంటాడు. అల్లరి, సాహసం కలగలిసిన ప్రతి పిల్లాడూ టామే! 1876 జూన్ 9న 'పుట్టిన' టామ్ సాయర్‌కు ఇప్పుడు 150 ఏళ్లు! కానీ ఆ తుంటరికి వయసనేది అయిపోతుందా? టామ్ సదాబాలుడు, సరదా బాలుడు; పోలీ పెద్దమ్మనే కాదు, సకల ప్రపంచాన్ని తన అల్లరి చేష్టలతో ఏలిన కౌబాలుడు. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవలను మార్క్ ట్వెయిన్ కేవలం పిల్లల కోసమే రాయలేదు. 'పెద్దవాళ్లు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం' చేసిందా నవల. ప్రపంచ సాహిత్య యవనికపై ఒక చిలిపి బాలుడి సాహసాలు ఇంతటి సుదీర్ఘ కాలం సజీవంగా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇంటి గోడకు సున్నం వేయడాన్ని కూడా ఒక కళగా మార్చి, ఇతరులతో పని చేయించుకునే తెలివితేటలున్న టామ్ నేటి మేనేజ్‌మెంట్ గురువులకు ఆది గురువు. ఈ నవల రాకముందు, అమెరికన్ సాహిత్యం ఎక్కువగా యూరోపియన్ శైలిని అనుకరిస్తూ, నీతి సూత్రాలతో నిండి ఉండేది. కానీ ట్వెయిన్ అమెరికన్ మాండలికాన్ని, సామాన్యుల భాషను సాహిత్య గౌరవ పీఠంపై కూర్చో బెట్టాడు. 'ఆధునిక అమెరికన్ సాహిత్యం అంతా మార్క్ ట్వెయిన్ రాసిన ఒకే ఒక్క పుస్తకం నుండి పుట్టింది' అని 'ది అడ్వెంచర్స్ ఆఫ్ హకల్‌బెరీ ఫిన్' (1884) నవలను కొనియాడాడు ఎర్నెస్ట్ హెమింగ్వే. ఈ నవల టామ్ సాయర్‌కు పొడిగింపు అన్నది గుర్తుంచుకుంటే దాని బీజాలు మొదటే ఉన్నాయన్నది అర్థమవుతుంది.కొన్ని కథలు రాసినా ట్వెయిన్‌కు ఇది తొలి నవల. మిసిసిపీ నది తీరాన ఉన్న హానిబాల్ గ్రామంలో గడిపిన తన సొంత బాల్య స్మృతుల నుంచే ట్వెయిన్ ఈ కథను అల్లుకున్నాడు. తనకు తెలిసిన ముగ్గురు అల్లరి పిల్లల లక్షణాలను కలిపి 'టామ్'ను సృష్టించాడంటారు. పేరును మాత్రం లోకల్ హీరో అయిన ఒక ఫైర్‌ఫైటర్ మీదుగా స్వీకరించాడు. ట్వెయిన్‌కు అతడు స్నేహితుడు కూడా. ఇద్దరూ కలిసి సాయంత్రాలు షికార్లు కొట్టేవాళు . అందరికీ ఇష్టమైన హకల్‌బెరీ ఫిన్ పాత్రనేమో తన బాల్యమిత్రుడు టామ్ బ్లాంకెరీ షిప్ ఆధారంగా రూపొందించాడు. ట్వెయిన్ చుట్టూ ఎందరు టాములో! సిడ్ సాయర్, బెకీ థాచర్, జడ్జ్ థాచర్, జో హార్పర్, విడో డగ్లస్, ఇంజన్ జో లాంటి పాత్రలు కూడా మరిచిపోలేనివి. సినిమాలుగా, టీవీ ప్రోగ్రాములుగా, మ్యూజి కల్సుగా అలరించిన టామ్ సాయర్, టైప్‌రైటర్ మీద రాసిన తొలి నవల అని ప్రచారంలో ఉంది. కానీ అది నిజానికి 'లైఫ్ ఆన్ ద మిసిసిపీ' (1883) అని మరోమాట! ఇదీ మార్క్ ట్వెయిన్‌దే కావడం గమనార్హం.పిల్లలు కేవలం మంచివాళ్లు లేదా చెడ్డవాళ్లు కాదు; వాళ్లు అల్లరి, భయం,సాహసం కలగలిసిన వాళ్లని ప్రపంచానికి చాటి చెప్పాడు ట్వెయిన్. ప్రకృతితో మమేకమవ్వడం, అన్వేషించడం నేటి పిల్లలు కోల్పోతున్న సహజ లక్షణాలు. చీకటి గుహల్లో నిధుల కోసం వెతికిన టామ్ మనకు ఇదే గుర్తు చేస్తాడు. నేటి డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్లకు బందీలైపోతున్న బాల్యానికి టామ్ సాయర్ ఒక తాళంచెవి. వందల ఏళ్లు గడిచినా, సమాజం ఎంత ఆధునీకరించబడినా మనుషుల్లోని అమాయ కత్వం, సాహస ప్రవృత్తి మారవు. అందుకే 'టామ్ సాయర్' కేవలం ఒక పుస్తకం కాదు, అది ప్రతి ఒక్కరి లోపల దాగి ఉన్న బాల్యానికి నిలువుటద్దం. ఈ 150వ వేడుకల సందర్భంగా మనలోని ఆ చిలిపి టామ్ సాయర్‌ను ఒకసారి నిద్రలేపుదాం! ఈ నవలను నందూరి రామమోహనరావు (1927–2011) టామ్ మన పక్కింటి పిల్లాడే అన్నంత హాయిగా తెలుగులోకి అనువదించాడు. రచయిత నామిని తన కొడుక్కు టామ్ సాయర్ అని పేరు పెట్టుకున్నాడు. టామ్ ఎంతటి తెలుగువాడో చెప్పడానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు. ఈ తిరుపతి టామ్ రచయితగా మారడం ఆ టామ్‌ను కన్నమార్క్ ట్వెయిన్‌కు తగిన నివాళి.

## నువ్వు మేనేజ్‌మెంట్ కోటా.. రేవంత్ మెరిట్ కోటా

పదేళ్ల పాటు కేటీఆర్ రాజులా విర్రవీగారని.. అమెరికా నుంచి నేరుగా వచ్చి స్థానిక నేత మహేందర్‌రెడ్డి టికెట్ లాక్కుని ఎన్ఆర్ఐ కోటాలో తెలంగాణలో పోటీ చేశారే తప్ప ఆయనకు ప్రజాస్వామ్యంపై అవగాహన లేదన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల నుంచి సీఎం స్థాయి వరకు ఒక్కోమెట్టు ఎక్కుతూ మెరిట్ కోటాలో ప్రజాదరణతో ఈ స్థాయికి వచ్చారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క గురుకుల పాఠశాలకైనా సొంత భవనాన్ని నిర్మించినట్లు నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమన్నారు. వారి హయాంలో గురుకులాల సంఖ్యను పెంచి, మౌలిక వసతులను గాలికొదిలేశారని విమర్శించారు.

# దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమం

**మొదటిపేజీ తరువాయి -** చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని సీఎం అన్నారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కేవలం ఈరోజు బాగుంటే చాలదు, భవిష్యత్ కూడా బాగుండేలా ప్రణాళికలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, విశాఖలో గూగుల్?: రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే మన వాళ్లు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాదని ఆయన భరోసా ఇచ్చారు. గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతామని, రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు దరిచేరవన్నారు. అందరి జీవన ప్రమాణాలు




పెరగాలన్నదే మా కల అని సీఎం వివరించారు.'పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్, నేను కలిసి పని చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైఎస్సార్సీపీ ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యం: తిరుమల వెంకటేశ్వరస్వామి జోలికొస్తే ఆయనే చూసుకుంటారని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం మంచి పని కాదు సీఎం హెచ్చరించారు. ఆలయాలను అపవిత్రం చేయాలని చూస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి మాపై నెట్టాలని చూశారని మండిపడ్డారు. ఆరా తీస్తే వైఎస్సార్సీపీ వాళ్లే చేసినట్లు రుజువైందన్నారు. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.దళితుణ్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారా? అని సీఎం సూటిగా ప్రశ్నించారు. సీబీఎన్ పాలనలో అరాచక శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని సీఎం హితవు పలికారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే మా ధ్యేయమని 2027 పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కొత్తపల్లి మండలంలో ఫిషింగ్ హార్బర్ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# దేశంలో జల వనరుల నిర్వహణ కోసం ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

**మొదటిపేజీ తరువాయి -** పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్–2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ – వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్– వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

# యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

**మొదటిపేజీ తరువాయి -** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన వృద్ధిని బలంగా కొనసాగిస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలు మే నెలలో మరోసారి సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ నెలలో లావాదేవీల సంఖ్య (వాల్యూమ్) 23.20 బిలియన్లకు చేరగా, వాటి విలువ దాదాపు రూ.30 లక్షల కోట్ల మార్కును తాకింది. ఈ వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. మే నెలలో యూపీఐ ద్వారా మొత్తం రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 24 శాతం పెరగ్గా, వాటి విలువ 19 శాతం వృద్ధి చెందింది. మే నెలలో సగటున రోజుకు సుమారు 748 మిలియన్ల లావాదేవీలు జరిగాయని, వాటి సగటు విలువ రోజుకు సుమారు రూ.96,465 కోట్లుగా ఉందని




గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నెలతో పోల్చినా లావాదేవీల సంఖ్యలో 3.8 శాతం, విలువలో 3 శాతం పెరుగుదల కనిపించింది.గత ఏప్రిల్ నెలలో కూడా డిజిటల్ చెల్లింపులు 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తూ 22.35 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వాటి విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. యూపీఐతో పాటు, ఇతర డిజిటల్ చెల్లింపులైన ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా మే నెలలో 358 మిలియన్ల లావాదేవీలు, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా 88 మిలియన్ల లావాదేవీలు జరిగాయి.కేవలం దేశంలోనే కాకుండా, యూపీఐ సేవలు అంతర్జాతీయంగా కూడా విస్తరిస్తు న్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్‌తో సహా 8కి పైగా దేశాల్లో ప్రస్తుతం యూపీఐ అందుబాటులో ఉంది. దీంతో డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో ఏకంగా 12,000 రెట్ల అసాధారణ వృద్ధి నమోదైంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్లుగా ఉన్న లావాదేవీలు, 2025–26 ఆర్థిక సంవత్సరానికి 24,162 కోట్లకు పైగా పెరగడం విశేషం.

# చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు



**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు.ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.అనంతరం, తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్



**మొదటిపేజీ తరువాయి -** ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు.అంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ - నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

**మొదటిపేజీ తరువాయి -** చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతోపాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామన్నారు. నేడు ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదలచేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.పరీక్షల నిర్వహణలో లీకేజీలకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వివరించారు. భవిష్యత్‌తో పరీక్షలను రావీ= విధానంలో కాకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకి మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. యూపీఎస్సీకి చెందిన ప్రతిభాసేతు తరహాలో రాష్ట్రంలో ప్రతిభా భారతి కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొలువులివ్వడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం తెలిపారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు." నేడు మూడు నోటిఫికేషన్లు వస్తాయి. మరో వారంలోనే మరికొన్ని ఉద్యోగ భర్తీకి ప్రకటన లొస్తాయి. ఈనెలలోనే సుమారుగా 5 నుంచి 6 నోటిఫికేషన్‌లు ఇస్తాం. తక్కువ పోస్టులున్న వాటిని ఎలా భర్తీ చేయాలో ఆలోచన చేస్తున్నాం. ప్రతి రెండు మూడు నెలలకు ఫలితాలను ప్రకటిస్తాం. మూడు నుంచి గరిష్టంగా 6 నెలల కాలంలో ఉద్యోగాల్లో చేరాలా చర్యలు తీసుకుంటాం. టీజీపీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేయడం మంచిదికాదు"

Aruna Bhumi Telugu Daily RNI APTEL/25/A1236
అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం 02-06-2026

## జాతీయ రహదారిపై లారీలో అగ్నిప్రమాదం

### తృటిలో తప్పిన పెను ప్రమాదం



పెద్దవడుగూరు జూన్ 01 ఆరుణభూమి న్యూస్ : అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి బెంగళూరుకు బ్రీజర్ ఖాళీ సీసాల లోడుతో వెళ్తున్న ఒక లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణంలో ఉండగానే మంటలను గమనించిన లారీ డ్రైవర్ రషీద్ అప్రమత్తమై, వెంటనే వాహనాన్ని నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు.రంగంలోకి దిగిన పోలీసులు తక్షణమే అగ్నిమాపక శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ రషీద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించి చర్యలు చేపట్టడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎరువుల ధరల పెంపునకు నిరసనగా పెద్దవడుగూరు సచివాలయం వద్ద జీవో కాపీల దహనం,!!



పెద్దవడుగూరు జూన్ 01 ఆరుణభూమి న్యూస్ : కాంప్లెక్స్ ఎరువుల ధరలను అమాంతంగా పెంచడాన్ని నిరసిస్తూ పెద్దవడుగూరులోని ఒకటి, రెండు సచివాలయాల వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఉధృత నిరసన చేపట్టారు. పెంచిన ధరలకు సంబంధించిన ప్రభుత్వ జీవో కాపీలను సచివాలయం ఎదుట తగులబెట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి మాట్లాడుతూ.. పెట్టుబడి ఖర్చులు పెరిగి ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగంపై, ఎరువుల ధరలను అమాంతం పెంచి ప్రభుత్వం మరింత భారం మోపడం దుర్మార్గమన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులతో పాటు స్థానిక రైతులు శ్రీరాములు రెడ్డి, మస్తాన్, రమేష్ బాబు, ఆదినారాయణమ్మ, నారాయణరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం దడియాల ఆదినారాయణ







యాడికి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :యాడికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతూ సూపర్ సక్సెస్ అయ్యాయని యాడికి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ తెలిపారు. తాడపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం యాడికి పట్టణంలోని హాస్పిటల్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు.దడియాల ఆదినారాయణ మాట్లాడుతూ, తాడపత్రి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. యాడికి మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. మండలంలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిట్టెపు చంద్రశేఖర్ రెడ్డి, వంకం నాగరాజు, కె. చంద్రశేఖర్, రాఘవేంద్రతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ పోలీస్ ఏ.ఖాజా కు ఘనంగా సన్మానం చేసిన ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు



పాములపాడు జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :-పాములపాడులోని, సేవా భారతి (వై ఆర్ డి ఎస్) కార్యాలయం దగ్గర ఇక్కడి నుండి వెలుగోడు పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళుతున్న ఉత్తమ పోలీస్ ఏ.ఖాజా కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షా అలీ, మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్.ముర్తుజాఅలీ, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, సిపిఎం పార్టీ నాయకులు డి.స్వామన్న, టి.వెంకటేశ్వరరావు, వైయస్సార్సీపి మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ బాషా, వాల్మీకి సంఘం నాయకులు తిరుపతయ్య లు శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు ఎస్.షేక్షాఅలీ(కాంగ్రెస్), కో ఆప్షన్ మెంబర్ ఎస్.ముర్తుజాఅలీ, డివిఎంసి మెంబర్ ఎల్.నాగరాజు, కే.అంకన్న(మాల మహానాడు), సయ్యద్ బాషా (వైఎస్ఆర్సిపి), సిపిఎం పార్టీ నాయకులు డి.స్వామన్న, టి.వెంకటేశ్వరరావు, జూటూరు తిరుపతయ్య(వాల్మీకి) లు మాట్లాడుతూ మన కానిస్టేబుల్ ఏ.ఖాజా ఏ పోలీస్ స్టేషన్లో పనిచేసిన కూడా తన విధులు సిన్సియారిటీగా నిర్వహిస్తూ, నీతి, నిజాయితీగా, నిష్పక్షపాతంగా, సామరస్యంగా పనిచేయడం జరిగిందన్నారు. ఆయన సేవలను గుర్తించి గత స్వాతంత్ర దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్ ఉత్తమ పోలీస్ ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఆయన నేను పోలీస్ కథ అనే గర్వం లేకుండా అధికారులతో, ప్రజా ప్రతినిధులతో, ప్రజా సంఘాల నాయకులతో, ప్రజలతో స్నేహ పూర్వకంగా ఫ్రెండ్లీ పోలీసు కు నిదర్శనంగా ఉత్తమ సేవలు అందించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఆయన భవిష్యత్తులో ప్రమోషన్లు పొంది ప్రజలకు ఒక మంచి పోలీసు అధికారి గా సేవలందించాలని ఆ దేవుని ప్రార్థిస్తూ కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎర్రగూడూరు టిడిపి నాయకుడు మంజుల నాగార్జున, ప్రజా సంఘాల నాయకులు మైమాకర్, జాకీర్, సోషల్ మీడియా ప్రతినిధులు గోవిందు, మోసే, నాగ స్వామి నాయక్, ఎస్.షర్ఫద్దీన్ అలీ, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొనడం జరిగింది.

## విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష

### హోంమంత్రి అనిత

### కార్యకర్తల మనోభావాలకు భంగం కలిగితే చర్యలు తప్పవు





ఉత్తరాంధ్ర ప్రతినిధి జూన్ 1ఆరుణభూమి న్యూస్ :విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ అని, దాని ఏర్పాటు దిశగా ఎన్డీఏ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు అని పేర్కొన్న హోంమంత్రి, దీనికోసం టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని, కేసుల రాజకీయాలపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పార్లమెంట్ సభ్యుల చొరవతో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రక్రియ వేగం పుంజుకుందని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైల్వే జోన్ కోసం అవసరమైన 50 ఎకరాల భూమిని కూడా కేటాయించలేదని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు సంబరాలు చేసుకోవాల్సిన సందర్భమిదని హోంమంత్రి అన్నారు. రైల్వే జోన్ ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడటమే కాకుండా ప్రత్యక్ష, పరోక్ష రంగాల్లో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, ప్రముఖ సంస్థలు కూడా ఈ ప్రాంతంపై ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. గూగుల్ వంటి సంస్థ ఉత్తరాంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమని చెప్పారు. రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చే పరిస్థితులు ఏర్పడతాయని, ఉద్యోగ అవకాశాలు కల్పించే కేంద్రంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తల అంశంపై స్పందించిన హోంమంత్రి అనిత, కార్యకర్తలు ఉంటేనే పార్టీ ఉంటుందని, టీడీపీకి కార్యకర్తలే అసలైన అధినేతలని అన్నారు. కార్యకర్తల మాట తమకు శిరోధార్యమని పేర్కొంటూ,సీఐ విషయంలో సోషల్ మీడియాలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయనే అంశాన్ని గమనించానని చెప్పారు. దీనిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అనంత రైతాంగ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి

### జిల్లా రైతులను ఆదుకోవాలి: ఏపీ రైతు సంఘం




యాడికి జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :యాడికి కరువు ప్రభావిత అనంతపురం జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అనంతపురం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ముందస్తు వర్షాలతో రైతులు సాగుకు సిద్ధమైనప్పటికీ విత్తనాల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విత్తన ఏజెన్సీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్లే సరఫరా నిలిచిపోయిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని వారం రోజుల్లోగా విత్తనాల పంపిణీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు భూములను బీడుగా ఉంచాల్సిన పరిస్థితి వస్తుందని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.కరువు జిల్లాగా గుర్తింపు పొందిన అనంతపురంలో అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలను తగ్గించి తగిన నిల్వలు సిద్ధంగా ఉంచాలని కోరారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' పెంచి, ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.5 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేసేలా బ్యాంకులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు .అలాగే ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన దానిమ్మ రైతులకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రైతు సంఘం నాయకులు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ విభాగం అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టి.నారాయణ స్వామి, పెద్దవడుగూరు వెంకటరాముడు, సెట్టూరు నరసింహులు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.టి. రామాంజనేయులు, కార్యదర్శి సనప రామకృష్ణ, నాయకులు ఎం. రమేష్, ఓబి రెడ్డి, గోగుల నరేష్, దురా ప్రసాద్, మధు, వెంకట్రాముడు, నాగేష్, గోపాలు, రామాంజనేయులు, శ్రీకాంత్, బండి వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఏ. కొత్తపల్లిలో ఘనంగా యలవగంపల ఊరేగింపు ఉత్సవం!



యలవ గంపను బక్తి, శ్రద్ధలతో మోసిన వైస్సార్సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పొట్ట పురుషోత్తం రెడ్డి

గ్రామస్తులకు, భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటుచేసిన పొట్ట పురుషోత్తం రెడ్డి!



అమడగూరు జూన్ 1 ఆరుణభూమి న్యూస్ : మండల పరిధిలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో సోమవారం అక్కదేవతల యలవగంపల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. బత్తల వెంకటరమణ కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం అక్కదేవతల పరుష రెండు రోజులు పాటు నిర్వహిస్తారు.ఇందులో భాగంగా మొదటి రోజు యలవగంపల కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్దలతో మహిళలు వేకువ జామునే ప్రత్యేక పూజ నిర్వహించి , అక్క దేవతలు కు ప్రత్యేక అలంకరణ చేసి యలవగంపలను పసుపు కుంకుమలతో పూజించి అక్కదేవతలకు వెండి గొడుగులు గాజులు,పూజ సామాగ్రితో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి కోదండ రామస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడ నుండి గ్రామ సరిహద్దులోని అక్కదేవతల గుడి వద్దకు చేరుకొని అక్కడ అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి అర్ధ రాత్రి లో యలవగంప కార్యక్రమం నిర్వహించారు. ఈ యలవ గంపల కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పొట్ట పురుషోత్తం రెడ్డి యలవ గంపను ఇంట్లో కట్టి అక్కదేవతల మొక్కులను చెల్లించారు. అనంతరం పురుషోత్తం రెడ్డి స్వయానా ఏలవ గంప ను మోసి గ్రామ అభివృద్ధి కోసం తమవంతుగా ఏలవా మోసి గ్రామ అభివృద్ధికి మొక్కులు తీర్చుకున్నారు . అనంతరం గ్రామస్తులకు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ పొట్ట పురుషోత్తం రెడ్డి , కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమం లో గ్రామస్తులు, భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు







బుక్కరాయసముద్రం జూన్ 01 ఆరుణభూమి న్యూస్ : :- మండలము లోని రెడ్డిపల్లి గ్రామములో రెండు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 4,02,085/-(నాలుగు లక్షల రెండు వేల ఎనబది ఐదు రూపాయలు విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసారు. న్యూ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, ప్రసన్న ఆంజనేయ ఫర్టిలైజర్స్ దుకాణలలో అనుమతి పత్రాలు వుండి లైసెన్స్ లొ చేర్చుకోని పత్రాల యొక్క ఎరువుల విలువను లెక్కకట్టి 21 రోజుల పాటు అమ్మకాలు జరుపకుండా నిలుపదల చేసారు. అదేవిదంగా నోటీసు బోర్డు మీద ధరలను రైతులకు అర్థం అయేటట్టు వ్రాయాలని యూరియా, డి ఎ పి ఎరువుల ను అమ్మే సమయంలో రైతుల యొక్క ఆధార్ ను మొబైల్ నెంబర్ ను కచ్చితంగా బిల్ మీద వ్రాసి రైతు సంతకం తీసుకోవాలని, రైతు యొక్క విస్తీర్ణం బట్టి వేసిన పంటలను బట్టి ఎరువులను రైతుకు అమ్మాలని, ఎం ఆర్ పి ధరలకే ఎరువులను అమ్మాలని అట్లు చెయ్యని యెడల నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ వ్యవసాయధికారి వాసుప్రకాష్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ నరేంద్ర భూపతి తెలియజేసారు. ఈ తనికీలలో మండల వ్యవసాయధికారి శ్యాం సుందర్, విజిలెన్స్ కాన్స్టేబుల్ లు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ









అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :చోడవరం పట్టణంలోని పదో వార్డు పరిధిలోని బానయ్య కోనేరు తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పెన్షన్ అందేలా చర్యలు చేపట్టారు.స్థానిక ఎమ్మెల్యే శ్రీ కే ఎస్ ఎన్ ఎస్ రాజు గారి ఆదేశాల మేరకు మాజీ వార్డ్ మెంబర్ నేమాల ధనలక్ష్మి హరి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ముఖ్యంగా వయోభారం, అనారోగ్యం కారణంగా బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్న వారికి వారి గృహాల వద్దకే చేరుకుని పెన్షన్ అందించడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రతి నెలా తమ ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్ అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు ప్రజలు పాల్గొన్నారు.

Aruna Bhumi Telugu Daily RNI APTEL/25/A1236
అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు జాతీయ తెలుగు దినపత్రిక



# ఘనంగా ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు













పుట్టినరోజు సందర్భంగా పాత బస్టాండ్ గవర్నమెంట్ హాస్పిటల్ అన్నదాన కార్యక్రమం

(డోన్ ప్రతినిధి జూన్ 1 ఆరుణభూమి న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి,జన్మదినం సందర్భంగా డోన్ పట్టణంలో ఎం.ఎస్.ఆర్ ఆఫీస్ నందు టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డి యువసేన ఆధ్వర్యంలో ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి,జన్మదిన వేడుకలు కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా డోన్ పట్టణంలో వేంకటేశ్వర స్వామి ఆలయం శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో వారు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ ఉండాలని స్వామివారిని ప్రార్థించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.డోన్ పట్టణంలో పాత బస్టాండ్ మరియు గవర్నమెంట్ హాస్పిటల్ లో ధర్మవరం సుబ్బారెడ్డి యువ సేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. అదేవిధంగా ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వారిని ధర్మవరం సుబ్బారెడ్డి వారి సతీమణి మన్నె ఈశ్వరమ్మ దర్శించుకొని. ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కోటప్పకొండ లో శ్రీ కోటేశ్వర స్వామి వారిని సందర్శించుకొని మంగళగిరి పానకాల నరసింహస్వామి సందర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి. విజయవాడలోని ఏపీ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హెడ్ ఆఫీస్ లో సీడ్స్ అధికారులు ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన చేత కేక్ కటింగ్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం యువ నాయకులు గౌతమ్ కుమార్ రెడ్డి,టిడిపి సీనియర్ నాయకులు చాటకొండ శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ రామిరెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, చక్రపాణి గౌడ్,సిటీ కేబుల్ కిరణ్, కొచ్చేరువు మహేష్ రెడ్డి,హనుమంతు రెడ్డి, ఎర్ర స్వామి గౌడ్, టిడిపి కార్యకర్తలు ఎమ్మెస్సార్ యూత్ పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాల బాధ్యుల్ని శిక్షించాల్సిందే



వైఎస్సార్సీపీ నిరసనలు, వినతిపత్రాల సమర్పణ

ప్రభుత్వం స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమం

వైఎస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హెచ్చరిక

డీఎస్సీ అక్రమాలకు నిరసనగా విశాఖ జిల్లా కలెక్టరేట్ లో వినతిపత్రం సమర్పించిన తర్వాత వైఎస్సార్సీపీ సిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చేశారు అక్రమాలపై కలెక్టర్లరేట్ల వద్ద నిరసన తెలిపాం లోకేష్ అసమర్థత వల్లే డీఎస్సీలో అవకతవకలుఆయన రాజీనామా చేసి తీరాల్సిందకేకే రాజు డిమాండ అక్రమాల కోసమే డీఎస్సీ పాత నోటిఫికేషన్ రద్దు స్పోర్ట్స్ కోటా జీవోల్ని మార్చి అర్హుల్ని ముంచారు ఏ అర్హతతో లోకేష్ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు? లోకేష్ ను తప్పించాలి, సీబీఐ దర్యాప్తు చేయించాలి

తేల్చిచెప్పిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఉత్తరాంధ్ర ప్రతినిధి జూన్ 1 యువతరం న్యూస్ : డీఎస్సీలో ఏ విభాగంలో చూసినా అడుగడుగునా అక్రమాలే కనిపిస్తున్నాయని, వీటిపై తాము ఆధారాలతో ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, దీనికి నిరసనగా ఇవాళ కలెక్టరేట్ల ముందు నిరసనలు తెలిపామని వైఎస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెల్లడించారు. విశాఖ కలెక్టరేట్ వద్ద నిరసనలు తెలిపి, అధికారులకు వినతిపత్రం సమర్పించాక కేకే రాజు, జక్కంపూడి రాజా సిటీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా డీఎస్సీ అక్రమాలపై స్పందించి విద్యామంత్రి లోకేష్ ను కేబినెట్ నుంచి తప్పించాలని, సీబీఐ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కేకే రాజు, జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు.

ప్రెస్ మీట్లో కేకే రాజు, జక్కంపూడి రాజా ఇంకేమన్నారంటే...

మెగా కాదు దగా డీఎస్సీయే ఇది

కేకే రాజు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు

రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టరేట్ల దగ్గర మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చిన కూటమి ప్రభుత్వంపై, డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థుల తరపున వినతిపత్రాలు సమర్పించాం. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యం, పారిశ్రామిక రంగంలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలబెట్టాలని తపించారు. 2019న మే 31న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆరు నెలల్లోపే అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి రోజున జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ల వ్యవస్థను తెచ్చారు. లక్షా 30 వేల మంది నిరుద్యోగులకు ఒకేసారి పారదర్శకంగా ఉద్యోగాలు కల్పించారు. కానీ యువగళంలో లోకేష్, ఎన్నికల సభల్లో చంద్రబాబు .. అధికారంలోకి రాగానే జిల్లాకు లక్ష ఉద్యోగాల చొప్పున 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్, విద్య రంగానికి కూడా అలాగే తూట్లు పొడిచారు. ఇప్పుడు డీఎస్సీకి సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి మూడు లక్షల మంది కలల్ని కల్లలు చేశారు. లోకేష్ చేతకానితనం, అసమర్థతతోనే ఈ స్కాం జరిగింది. లోకేష్ దీనికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నాం.

చంద్రబాబు ఖాతాలో మరో మోసం

జక్కంపూడి రాజా, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

చంద్రబాబు, లోకేష్ ఎన్నికలకు ముందు ఊరూరా తిరిగి.. బాబొస్తేనే జాబొస్తుందని, మొట్టమొదటి సంతకం డీఎస్సీపైనే అని చెప్పి నిరుద్యోగుల ఓట్లు దండుకున్నారు. ఆ తర్వాత తనకు అలవాటైన తీరులో హామీలన్నీ అటకెక్కించేశారు. జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ నోటిఫికేషన్ అత్యంత పారదర్శకంగా ఇస్తే, దాన్ని అడ్డగోలుగా రద్దు చేసి ధనార్జనే ధ్యేయంగా కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. విద్యాశాఖకు మంత్రిగా పనిచేస్తున్న లోకేష్ కు ముఖ్యమంత్రి కొడుకు అన్న అర్హత మాత్రమే ఉంది. అదే ఇప్పుడు రాష్ట్ర యువతకు శాపంగా మారింది. ఏదో విధంగా లోకేష్ ను మంత్రి చేయాలనుకుంటే, ఏదో ఒక అప్రాధాన్య శాఖ ఇస్తే సరిపోయేది. కానీ లక్షల మంది జీవితాలతో చెలగాటం ఆడే అవకాశం ఇచ్చారు. పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కారణంగానే లక్షల మంది ఆక్రందనలు, బాధలు పడుతున్నారు. టీచర్ అవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం పొందాలని ప్రయత్నిస్తే తమను మోసం చేసి రోడ్లపైకి లాగారని ఓ మహిళ బాధపడుతున్నారు. రోజుకు 20 గంటల పాటు చదువుకుని, అప్పులు తెచ్చి లక్షలు ఫీజులు కట్టి కోచింగ్ సెంటర్లకు వెళ్లి డీఎస్సీ కొట్టాలని భావించిన అభ్యర్థులు.. ఇప్పుడు జరిగిన అక్రమాలు చూసి నివ్వెరపోతున్నారు. ఈ 3 లక్షల 30 వేల మంది బాధితుల బాధ వర్ణనాతీతంగా ఉంది.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకునే అర్హత లోకేష్ కు ఎక్కడిది

మీకు ఏ అర్హత ఉందని నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని లోకేష్ ను ప్రశ్నిస్తున్నాం. ఇసుక, మైనింగే దోపిడీలే నిరుద్యోగులతో సైతం ఆడుకుంటున్నారు. హెరిటేజ్ పాలు, పెరుగు అమ్మినట్లు 15 లక్షలకు ఎస్జీటీ, 20 లక్షలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు రేట్లు పెట్టి అమ్ముకున్నారు. దాని ఆడియో రికార్డింగ్ లీక్ అయినా ఏ ఒక్కరిపై ఇవాల్టికీ చర్యలు తీసుకోలేదు. దీన్ని బట్టి కచ్చితంగా ఇందులో లోకేష్ పాత్ర ఉందని అర్థమవుతోంది. శ్రీకాకుళం నుంచి రాయలసీమ వరకూ ఎంతో మంది కేటగిరీల వారీగా మొదటి ర్యాంకులు వచ్చిన వారు తమకు ఉద్యోగాలు రాలేదని బాధపడుతుంటే కనిపించట్లేదా ? స్పోర్ట్స్ కోటాలో తాడాట, బొంగరం ఆటలకు ఉద్యోగాలిచ్చారు. ఈ నోటిఫికేషన్ ఇచ్చాక స్పోర్ట్స్ కోటా ఇచ్చి, రిక్రూట్ మెంట్ పూర్తయ్యే వరకూ ఆగి, ఆ తర్వాత ఆ జీవోను ఎత్తేశారంటే ఇందులో అక్రమాలు జరిగినట్లే కదా. కాల్ లెటర్లు అందరికీ ఇవ్వం, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో బేరాలు కుదుర్చుకున్న వారికే పోస్టులు ఇచ్చినట్లు కనిపిస్తోంది. మీలో చిత్తశుద్ధి ఉంటే లోకేష్ ను వెంటనే విద్యాశాఖ నుంచి, మంత్రి పదవి నుంచి తప్పించాలి. సీబీఐ విచారణ చేయించాలి లేనిపక్షంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి. లేకపోతే ఇందులో లోకేష్ పాత్ర ఉందని అందరికీ అర్థమవుతుంది. ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో కేసులు పెట్టి, లోకేష్ ను ఏ1గా చేర్చాలి. ఇవాళ జరిగిన కార్యక్రమం ఆరంభం మాత్రమే. డీఎస్సీ అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఉద్యమాలు తప్పవని జక్కంపూడి రాజా హెచ్చరించారు.

# మూడు కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించడంలో విఫలం

విఫలమైన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఫోరమ్ ఫర్ ఆర్టిఐ, జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న కార్తికేయ డిమాండ్



పెద్దకడబూరు జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :ప్రతినిధి : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలోని సర్వే నెంబర్ 262 /ఏ3 లో విస్తీర్ణం 3.30 సుమారు మూడు కోట్లు రూపాయల విలువ గల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురవుతున్నప్పటికీ, వాటిని కాపాడడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని ఫోరమ్ ఫర్ ఆర్టిఐ, జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న కార్తికేయ సోమవారం పత్రిక విలేకరులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించడం, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటం రెవెన్యూ శాఖ యొక్క ప్రధాన బాధ్యత. అయితే భూమి కబ్జా జరుగుతున్నట్లు పలుమార్లు ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు, మరియు సామాజిక కార్యకర్తలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు కనిపించకపోవడం విచారకరం. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే, ప్రజా సంపదకు జరుగుతున్న నష్టానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రాలు సమర్పించడమే కాకుండా, పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు చేసిన క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యంగా ఉండటం ప్రజలను నిరాశకు గురిచేసిన ఫిర్యాదులపై విచారణ జరిపి, కబ్జాదారులకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అదేవిధంగా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారుల పాత్రపై సమగ్ర విచారణ నిర్వహించి, రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.



# పెరిగిన ఎరువుల ధరలను తగ్గించండి సిపిఐ డిమాండ్

కోడుమూరు జూన్ 1ఆరుణభూమి న్యూస్ : దేశంలో పెరిగిన ఎరువుల మరియు రసాయనాల ధరలు వెంటనే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో కోడుమూరు ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.రాజు , రైతు సంఘం మండల కార్యదర్శి కొళాయిల రాముడు,మహిళా సమైక్య జిల్లా నాయకురాలు సులోచనమ్మ మాట్లాడుతూ దేశంలో రైతన్నలు అనేక సమస్యలను ఎదుర్కొంటూ పంటలు పండిస్తున్నారని అందులో ప్రధానంగా ఎరువులు క్రిమిసంహారక మందులు ధరలు అధికంగా ఉండడంతో రైతుకు గిట్టుబాటు కావడం లేదని కాబట్టి వెంటనే ఎరువుల ధరలు తగ్గించాలని మరియు రైతులకు 90 శాతం సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు, రసాయనాలు ఇవ్వాలని అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద 20000 రూపాయలు ప్రస్తుతం ఇస్తున్నారని కానీ దానిని 50 వేలకు పెంచి రైతులకు ఇవ్వాలని మరియు రైతులకు నాణ్యతలేని విత్తనాలను రైతులకు అమ్ముతున్న ఫర్టిలైజర్ దుకాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, రైతులకు రుణమాఫీ చేయాలని మరియు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి రైతన్నకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ధర్నా చేపట్టారు. అనంతరం కోడుమూరు ఎమ్మార్వో బి నాగరాజుకు వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జయరాముడు వెంకటేశు శ్రీనివాసు మద్దిలేటి నాగన్న శీను మహిళలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులు, విత్తనాలు 90% సబ్సిడీతోనే ఇవ్వాలి

పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలి

ఫర్టిలైజర్ షాపుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలి

తహసిల్దార్ వలి భాషా కు వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు



పెద్దకడబూరు జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా పిలుపు మేరకు సోమవారం తాహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఖరీఫ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ వలి భాషకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందును అధికార కూటమి ప్రభుత్వం రైతులకు కౌలు రైతులకు ముందస్తుగానే ప్రణాళిక రూపొందించలేదు మార్కెట్లో నాణ్యమైన విత్తనాలు నాణ్యమైన ఎరువులు రైతులకు సకాలంలో 90% శాతం సభ్సిడికే ఇవ్వాలని ఆయా బ్యాంకులలో పంట రుణాలు ఇవ్వాలని అన్ని రకాల పంటల విత్తనాలు ఎరువులు క్రిమిసంహారక మందులు గ్రామ సచివాలయాలలో అందుబాటులో ఉంచాలి. మరియు పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలి ఫర్టిలైజర్ షాపుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలి. నాణ్యతలేని విత్తనాలు నాసిరకం విత్తనాలు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్న షాపుల మీద యాజమాన్యం మీద చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మహాదేవ సిపిఐ సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర నాగరాజ్ వీరేష్ ఆంజనేయ ఆటో కుంటన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం

పాల్గొన్న టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్



పాములపాడు జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో ఈరోజు జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొని, కొత్తగా మంజూరైన పింఛన్ ముంతమ్మ బాయి కి పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా కంభం మోహన్ గౌడ్ గ్రామంలోని పెన్షన్ లబ్ధిదారులైన వృద్ధుల, వితంతువుల, దివ్యాంగుల, బెడ్ పేషెంట్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీనే మా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, సమయపాలనతో పెన్షన్లను నేరుగా ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందిస్తూ ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది ఖాసీం, టిడిపి నాయకులు గంటా రమేష్, ధర్మవరం మల్లికార్జున నాయుడు, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బమ్మ, శంకర్ రాములు నాయక్, మద్దూరు వెంకటస్వామి, లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

# ప్రమాదకరంగా మారిన రహదారి



కోడుమూరు జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :కోడుమూరు పట్టణంలో చిన్న బోయ వీధి నుంచి కొత్త బస్టాండ్ కు వెళ్లే ప్రధాన రహదారి పై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా కొత్తపేట వీధికి వెళ్లే రహదారి సైతం ఉండడంతో మలుపు ప్రమాదకరంగా తయారయింది. ఈ గుంత చాలా సంవత్సరాల క్రితం పడిన దీనికి తోడు ఆ గుంత పక్కనే గత రెండు నెలల క్రితం త్రాగునీటి పైపులైను మరమ్మత్తు కోసం మరొక గుంత ఏర్పాటు చేసి పైపులైన్ వేసి మట్టితో పూడ్చారు. గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా మట్టి కొట్టుకొని పోయి ఒక పెద్ద గొయ్యి మాదిరిగా తయారయ్యి వాహనదారులకు శాపంగా మారింది. ఈ ప్రధాన రహదారి వెంట చిన్నబోయ వీధి, కొత్తపేట వీధి , కొత్త బస్టాండ్ కి వెళ్లే ప్రజలు వాహనదారులకు ముఖ్యం కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు ప్రజలు ఈ రహదారి గుండా వెళు తూ ఉంటారు. ఉదయం వేలలో అయితే సరే కానీ రాత్రి సమయంలో ఏవైనా ప్రమాదాలు జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాబట్టి ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రధాన రహదారిపై ఉన్న గుంతను పూడ్చి రహదారిని బాగు చేయాలని స్థానికులు, ప్రజలు కోరుతున్నారు.

# సామాజిక పెన్షన్లు పంపిణీ చేసిన గంటా



ఉత్తరాంధ్ర ప్రతినిధి, జూన్ 1ఆరుణభూమి న్యూస్ : సంక్షేమ పథకాల అమలు ద్వారా పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సాగర్ నగర్ లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. పెన్షన్లు, జీతాలు ప్రతి నెల 1 వ తేదీన క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామన్నారు. ప్రతి నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ. 2,728 కోట్లు నేరుగా నగదు పెన్షన్ల రూపంలో అందిస్తున్నామని.. భీమిలి నియోజకవర్గంలో 14 వేల మందికి రూ.6.34 కోట్లు ఇస్తున్నామని వివరించారు. ఈనెల స్పౌజ్ కోటాలో 5606 మంది వితంతువులకు సామాజిక పెన్షన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చి వారి నమ్మకం గెలుచుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చెట్టుపల్లి సన్యాసిరావు, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

Aruna Bhumi Telugu Daily RNI APTEL/25/A1236
అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు జాతీయ తెలుగు దినపత్రిక



# ఎలైట్ క్రికెట్ లీగ్ (ఈసీఎల్) సీజన్-2" ట్రోఫీ ఆవిష్కరణ

రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి




ఉత్తరాంధ్ర ప్రతినిధి, జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :: విశాఖ వేదికగా చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'ఈసీఎల్ సీజన్ 2' క్రికెట్ టోర్నమెంట్ త్వరలో జరగనుందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండేపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. విశాఖలోని ఒక హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి మంత్రి పాల్గొని, ఈ టోర్నమెంట్ ట్రోఫీని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో ప్రజలను కాపాడే సైనికుల సహాయార్థం ఈ నెల 27, 28 తేదీలలో పీఎం పాలెం ఎ డీ సి ఎ, వి డి సి ఏ స్టేడియంలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఒక గొప్ప ఆశయంతో జరుగుతున్న ఈ మెగా టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు ప్రజలు, వాణిజ్య సంస్థలు భాగస్వాములు కావాలని, వచ్చే 25 రోజుల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో క్రికెట్ అనేది ఒక ఎమోషన్ అని, అందుకే ఈ సేవా కార్యక్రమానికి దీనిని వేదికగా ఎంచుకున్నరని తెలిపారు. మొత్తం 6 టీమ్‌లు తలపడే ఈ రెండు రోజుల టోర్నమెంట్‌లో సుమారు 35 నుండి 40 మంది ఎమ్మెల్యేలు, 15 మంది రాష్ట్ర మంత్రులతో పాటు సినీ, టీవీ ఆర్టిస్టులు, ప్రముఖ డాక్టర్లు క్రీడాకారులుగా పాల్గొంటారని చెప్పారు. టోర్నమెంట్ స్పాన్సర్‌షిప్ కోసం వ్యాపారవేత్త మారుతి 10 లక్షల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్న మంత్రి.. ఈ ఈవెంట్ ద్వారా సేకరించే కోటికి పైగా నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఎల్ చైర్మన్ చామల ఉదయ్ చందర్ రెడ్డి, నటుడు ఒ ఈసీఎల్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సామ రాజేందర్ రెడ్డి, ప్రముఖ నటుడు ప్రభాకర్, పున్రెడ్డి శివారెడ్డి, చారుణ్య తదితరులు పాల్గొన్నారు.

# పింఛనుతో పాటు మామిడి పండ్లను అందజేసిన జిల్లా కలెక్టర్



ఉత్తరాంధ్ర ప్రతినిధి, జూన్ 01ఆరుణభూమి న్యూస్ : : రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ భాగస్వామ్యమయ్యారు. సోమవారం ఉదయం జ్ఞానాపురం వద్ద పలువురు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. అలాగే జ్ఞానాపురంలో ఓ వితంతు మహిళకు రూ.4,000 పింఛను సొమ్ముతో పాటు మామిడి పండ్లను కూడా కలెక్టర్ అందించారు. దీనిపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ క్రతువు గురించి అడిగి తెలుసుకున్న ఆయన ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా డీఆర్డీఏ, యూసీడీ పీడీలను ఆదేశించారు. జ్ఞానాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, జీవీఎంసీ సీఎంవో నరేశ్ కుమార్, జడ్పీ మల్లయ్యనాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

అధికారులు ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలి.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.





కర్నూలు ప్రతినిధి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు భూముల సమస్యలు, గృహ స్థలాల కేటాయింపు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు, విద్య, పెన్షన్లు, రహదారులు తదితర అంశాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు అందజేసిన వినతులను శాఖలవారీగా నమోదు చేసి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, పరిష్కారం అయ్యే వరకు సంబంధిత అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ సుబ్బయ్య, ఏడి సర్వేయర్ మురళి కృష్ణ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొట్టాలపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న....

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ...





బుక్కరాయసముద్రం జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :- బుక్కరాయ సముద్రం మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ చేసే కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా వివిధ రకాల పెన్షన్ 4000 నుంచి 15000 రూపాయల వరకు భరోసా పథకం కింద పెన్షన్ పంపిణీ చేయడం మన ప్రభుత్వం పేదలకు ఇస్తున్నటువంటి గొప్ప భరోసా అని, ప్రతి నెల ఒకటో తారీఖున ఉదయమే పెన్షన్ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నదని, ఎంతోమంది తమ జీవనోపాధికి, జీవనానికి ఆసరాగా పెన్షన్ ఉపయోగపడుతున్నదని, ప్రజల సంక్షేమం కోసమే నిత్యం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలియజేశారు. గ్రామంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ కొరకు ఎంతో ఖర్చు పెడుతున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తున్న ఈ మంచి ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వదించాలని తెలిపారు. ఈ సందర్భంగా సింగనమల ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలియజేశారు. పెన్షన్ కార్యక్రమం అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే సందర్శించి చిన్నపిల్లలకు అందుతున్నటువంటి పౌష్టిక ఆహారము గురించి, ప్రభుత్వ కార్యక్రమాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారు అడిగి తెలుసుకుని, కొన్ని సూచనలు అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారులు, స్థానిక గ్రామ సెక్రెటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, మండలం కన్వీనర్ లక్ష్మీనారాయణ,ఎంపీపీ దాసరి సునీత, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ, సొసైటీ చైర్మన్ కేసన్న, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విమ్స్ నూతన డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మన్మధరావు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిద్దితా



ఉత్తరాంధ్ర ప్రతినిధి జూన్ 1ఆరుణభూమి న్యూస్ :: విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ నూతన డైరెక్టర్ గా డాక్టర్ వి. మన్మధరావు సోమవారం ఉదయం పదవి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన మన్మధరావుకు విమ్స్ ఆస్పత్రి వైద్యులు, అభిమానులు, సన్నిహితులు, ఆసుపత్రి పరిపాలన విభాగం, వివిధ విభాగాల సిబ్బంది పుష్ప గుచ్చలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ మన్మధరావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యం అన్నారు. సమిష్టి కృషితో విమ్స్ సర్వోతోముఖవృద్ధికి కృషి చేయనున్నట్టు తెలిపారు. విమ్స్ కు అన్ని హంగులు కల్పిస్తూ వైద్య సేవలను మరింత విస్తృత పరిచి పూర్తిస్థాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్గా తీర్చిదిద్దుతానని చెప్పారు. విమ్స్ లోని ప్రస్తుతం తొమ్మిది విభాగాలు సూపర్ స్పెషాలిటీగా, 10 విభాగాలు జనరల్ గా పనిచేస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు పనిచేసిన డైరెక్టర్ రాంబాబు ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు పంపారని వాటిని అదే స్పీడ్ తో ముందుకు తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత వున్న అంశం తన దృష్టికి వచ్చిందని ఈ అంశాన్ని రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్ళి ప్రభుత్వానికి నివేదించి త్వరగా భర్తీ చేయడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. హార్ట్ సర్జరీకి సంబంధించి పీపీపీ పద్ధతిలో క్యాథ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి ఇదే వరకు పంపారని దాన్ని ముందుకు తీసుకువెళతానని చెప్పారు. అవయవ దానం పై ప్రజలకు పలు అపోహాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేసి అవయవదాన కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్ పదవికి ఎంపిక చేసిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆంధ్రమెడికల్ కాలేజీ లోనే తాను ఎంబిబిఎస్ఎస్ విద్య, ఎం ఎస్, పూర్తి చేసినట్టు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొపెసర్, ప్రొఫెసర్, వైస్ ప్రిన్సిపాల్, సర్జరీ డిపార్ట్మెంట్ విభాగధిపతిగా కేజీహెచ్ లో వివిధ హోదాల్లో 29 సంవత్సరాలు పనిచేసినట్టు వివరించారు. మీడియా సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, అడ్మిన్ డాక్టర్ మనోజ్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ 'యువగళం' హామీని నిలబెట్టుకోవాలి..!

మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్



పామిడి, జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :తెలుగుదేశం పార్టీకి దశాబ్దాలుగా వెన్నుదన్నుగా నిలుస్తున్న యాదవ సామాజిక వర్గానికి ఈసారి రాజ్యసభ సీటు కేటాయించాలని టిడిపి యాదవ నాయకులు, మాజీ ఉప మండలాధ్యక్షుడు పెరమసాని రామాంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పామిడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ సంఘాల నాయకులు రంగస్వామి యాదవ్, ఓబులకృష్ణయ్య యాదవ్, నరసింహులుయాదవ్, పోతుల ఓబులయ్యయాదవ్, దశరథయాదవ్, రవికుమార్ యాదవ్‌లు కలిసి మాట్లాడారు.

తిప్పేస్వామి యాదవ్‌కు సీటిస్తేనే న్యాయం!

పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా నమ్మకంగా, క్రమశిక్షణతో సేవ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి యాదవ్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని నాయకులు కోరారు. ఆయనకు ఈ అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యాదవ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వస్తుందని, పార్టీ పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని స్పష్టం చేశారు. యాదవ సమాజం చూపిన నిబద్ధతను గుర్తించి టిడిపి అధిష్టానం ఈసారి ఖచ్చితంగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**'యువగళం' హామీని నిలబెట్టుకోవాల్సిన హామీకి సమయం ఆసన్నమైంది..!**

యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్‌ను యాదవ సంఘాల ప్రతినిధులు కలిసినప్పుడు... యాదవ సామాజిక వర్గానికి పార్లమెంట్ లేదా రాజ్యసభ స్థాయిలో తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకోవాల్సిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది."యాదవ సంఘాల నాయకులు భవిష్యత్తులో కూడా యాదవ సమాజం తెలుగుదేశం పార్టీకి పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని, అధిష్టానం తమ విజ్ఞప్తిని మన్నించి తిప్పేస్వామి యాదవ్‌కు రాజ్యసభ అవకాశం కల్పించాలని వారు ఈ సందర్భంగా గట్టిగా డిమాండ్ చేశారు.

# డీఎస్సీ బాధితులకు న్యాయం చేయాలి. యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి








కర్నూలు ప్రతినిధి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ : రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాల ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలు, అక్రమాలు మరియు అర్హులైన అభ్యర్థులకు జరిగిన అన్యాయాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ బాధితురాలు షేక్ హసీనాబీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి, బుట్టా ప్రతుల్ కలిసి కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ హసీనాబీ మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించి అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ చివరి దశలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యాక ఉద్యోగం వచ్చినట్లు సమాచారం అందినా, అనంతరం ఎలాంటి కారణం చెప్పకుండా నియామక పత్రం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. తనలాంటి ఎన్నో మంది అభ్యర్థులు అన్యాయానికి గురయ్యే అవకాశముందని పేర్కొంటూ నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

**అనంతరం కాటసాని శివ నరసింహారెడ్డి మాట్లాడుతూ...!!!**

లక్షలాది నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన డీఎస్సీ నియామకాల ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. మెరిట్ జాబితాల వెల్లడిలో పారదర్శకత లేకపోవడం, ఎంపిక ప్రక్రియపై సందేహాలు నెలకొనడం, అర్హులైన అభ్యర్థులకు అవకాశాలు దక్కకపోవడం వంటి అంశాలు యువతలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల నిర్వహణ, ఫేక్ సర్టిఫికెట్ల వినియోగం, మెరిట్ ఎంపిక విధానం, ఉద్యోగాల కేటాయింపులో జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై సీబీఐ లేదా ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తప్పులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని అర్హత కలిగిన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ నియామకాలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, విద్యార్థులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. "డీఎస్సీ బాధితులకు న్యాయం చేయాలి", "డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి", "నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడవద్దు", "అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా యువజన విభాగ అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి, జిల్లా కార్యదర్శి మధు, ఎమ్మిగనూరు యువజన విభాగ అధ్యక్షులు డి. నజీర్ అహ్మద్, కోడుమూరు యువజన విభాగ అధ్యక్షులు ఎం.కే. వెంకటేష్, పాణ్యం యువజన విభాగ అధ్యక్షులు దుర్గ, పత్తికొండ యువజన విభాగ అధ్యక్షులు అశోక్ కుమార్ రెడ్డి, పాణ్యం పబ్లిసిటీ విభాగ అధ్యక్షులు సాయి, ఎమ్మిగనూరు మండల యువజన విభాగ అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి తదితరులు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు. డీఎస్సీ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు, నియామకాలలో జరిగిన ప్రతి అవకతవకపై నిజాలు వెలుగులోకి వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నాయకులు స్పష్టం చేశారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కె . వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ.





కర్నూలు ప్రతినిధి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ :కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి జి ఎచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆసుపత్రిలోని ఓ.పి విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను, రికార్డులను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను కేసు షీట్స్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని, అలాగే స్టాఫ్ నర్సులు తప్పనిసరిగా పేషెంట్ ఫీడ్‌బ్యాక్ ఫామ్‌లను పూర్తి చేయించాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు ఈ రికార్డులు ఎంతో కీలకమని, ఇందులో ఎలాంటి అలసత్వం వహించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో శానిటేషన్ కలర్ (కలర్) కవర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, నిబంధనల ప్రకారం బయో-మెడికల్ వ్యర్థాల విభజనకు నిర్దేశిత కలర్ కవర్లను తక్షణమే అందుబాటులో ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వీడి, ఆసుపత్రి పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు ఆర్.ఎం.ఓ డాక్టర్ వెంకట రమణ , డిప్యూటీ కలెక్టర్/అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ , అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం.వి కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్స్ మరియు ఇతర ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా







## జిల్లాలో జూన్ మాసంలో 2,34,764 మందికి రూ.104.06 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ.

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

కర్నూలు ప్రతినిధి జూన్ 01 అరుణభూమి న్యూస్ :లబ్ధిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందచేస్తూ, జూన్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 34 వేల 764 మంది లబ్ధిదారులకు రూ. 104.06 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక దేవ నగర్ కాలనీ లో నిర్మల, శివ శంకర్ లకు వైకల్య పెన్షన్, ఆది లక్ష్మీ, ఝాన్సీ రాణి లకు వితంతువు పెన్షన్ లను, వెంకట రమణ రెడ్డి కు వృద్ధాప్య పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో, వికలాంగులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడుతూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా, అని కలెక్టర్ ఆరా తీశారు. పెన్షన్ ఎప్పటి నుండి వస్తుందని, వచ్చిన పెన్షన్ ను దేని కోసం వినియోగించుకుంటున్నారని కలెక్టర్ పెన్షన్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. చెత్తను కేసి కెనాల్ లో పడివేయకుండా తడి చెత్త, పొడి చెత్త గా విభజించి పారిశుధ్య సిబ్బంది ఇంటి ఇంటికి చెత్త సేకరణకు వచ్చిన సమయంలో వారికి అందచేయాలని కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించారు. కేసి కెనాల్ వద్ద మున్సిపల్ వారు చెత్తబుట్టలను ఏర్పాటు చేశారని చెత్తను బయట పడవేయకుండా అక్కడ ఏర్పాటు చేసిన చెత్తబుట్టలలో చెత్త వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ లను లబ్ధిదారులకు అందచేయడంలో తొలిరోజే 100 శాతం పెన్షన్ పంపిణీ చేయాలని, ఒకటీ, అరా మిగిలిపోతే రెండో రోజు కల్లా పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ డిఆర్డిఎ పిడి ని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోపీల పంపిణీ



కర్నూలు ప్రతినిధి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ : : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్స్ సహకారంతో టోపీల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులకు టోపీలను అందజేసి వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తుంటారని, వారి సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని తెలిపారు. తీవ్ర ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు టోపీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కిమ్స్ హాస్పిటల్ ప్రతినిధులు సీఈవో డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ, రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె శ్రీనువాసులు ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ జర్నలిస్టుల ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని, భవిష్యత్తులో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, జర్నలిస్టులు అవినాష్ చెన్నయ్య శ్రీనాథ్ రెడ్డి ప్రసాద్ రెడ్డి నరసింహ రాజు కెమెరామెన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్ ను రద్దు చేయాలి

### జైభీమ్ ఎంఆర్పీఎస్ నాయకులు డిమాండ్



పెద్దకడబూరు జూన్ 1 ఆరుణభూమి న్యూస్ : (ప్రతినిధి) : పెద్దకడబూరు మండల పరిధిలోని బస్సులదొడ్డి గ్రామంలో దళితులకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అక్రమ వెంచర్ ఏర్పాటు చేశారని జైభీమ్ ఎంఆర్పీఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం కర్నూలు సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జైభీమ్ ఎంఆర్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ, గ్రామ సర్వే నంబర్ 89లోని 4.19 ఎకరాల్లో దళితులకు కేటాయించిన భూమిలో 1.63 ఎకరాలను మాజీ వీఆర్వో డీఆర్ లంకరెడ్డి అక్రమంగా వెంచర్గా మార్చారని ఆరోపించారు. దళితులకు చెందిన భూములను తిరిగి వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు రాజకీయ పార్టీలు సహకరించాలి

### అర్హత కలిగిన పౌరునికి ఓటు హక్కు కలిగి ఉండాలి

### జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి.






కర్నూలు ప్రతినిధి జూన్ 01 ఆరుణభూమి న్యూస్ ::కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని జిల్లా లో అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టడానికి రాజకీయ పార్టీలు సహకరించాలి అని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పార్టీల ప్రతినిధులను కోరారు.సోమవారం సాయంకాలం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జాతీయ మరియు రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అమలు చేయడానికి అన్ని పార్టీల వారు సహకరించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మరణించిన, శాశ్వతంగా మారిన, నకిలీ మరియు పౌరులు కాని ఓటర్ల పేర్లను తొలగించడం ద్వారా, అర్హులైన పౌరులు వదిలివేయబడకుండా చూసుకోవడం ఓటర్ల జాబితాలు ఖచ్చితమైనవని తయారు చేసుకోవడం స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ యొక్క ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఎస్ఐఆర్కు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, విధానాలు, కాలపట్టికలు, కార్యాచరణపై రాజకీయ పార్టీల ప్రతినిధుల కు పూర్తి అవగాహన కల్పించారు . ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం ముద్రణ, బీఎల్ఓ కిట్ల పంపిణీ ఈ-రోల్ ఫ్రీజ్ పూర్తయిన వెంటనే ఎన్యూమరేషన్ ఫార్మలను ఇంటింటికి ఇచ్చి తిరిగి వారి నుండి పూర్తిచేసినది తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ పని పూర్తి చేయడానికి బిఎల్వోలు అవసరమైతే మూడుసార్లు ఇంటికి వస్తారని తెలిపారు. ఓటరు తన ఓటు హక్కును ఎక్కడ నుండి వినియోగించుకోవాలి అన్న స్వేచ్ఛను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఓటరు అధికారికంగా తన దగ్గర ఉన్న 12 గుర్తింపు కార్డులకు సంబంధించి ఒక పత్రం ను సెల్ఫ్ అటే స్టేషన్ చేసి ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. 1987 లో జన్మించిన వారు ఒక కేటగిరి గా ,1987 నుండి 2004 వరకు రెండవ కేటగిరి గా, 2004 తర్వాత జన్మించిన వారు మూడవ కేటగిరీగా పరిగణించి అందుకు సంబంధించిన పత్రాలను అందజేయవలసి ఉంటుందని తెలిపారు. స్థానికంగా లేనివారి ఓటు హక్కును అన్ని విధాల పరీక్షించుకొని తొలగించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి తెలియజేశారు. రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని వారి వివరాలు అందజేయాలని వారికి పార్టీ తరఫున గుర్తింపు కార్డు ఉండాలని బిఎల్ఎ మరియు బిఎల్ఓ లు ఇద్దరు సమన్వయంతో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని అందుకు పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యాచరణ షెడ్యూల్ క్రింది విధంగా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లో భాగంగా ప్రిపరేషన్, ట్రైనింగ్, ప్రింటింగ్ తదితర కార్యక్రమాలు జూన్ 5వ తేదీ నుండి జూన్ 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ చేపట్టే "హౌస్ టు హౌస్ వెరిఫికేషన్" కార్యక్రమం జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ జూలై 14న పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ను జూలై 21న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ స్వీకరణ జరుగుతుందని, వాటి పరిష్కార ప్రక్రియ జూలై 21 నుండి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి దశలో పారదర్శకత పాటిస్తూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చేపట్టటం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ తెలియజేశారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల అనుమానాలను జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, భారతీయ జనతా పార్టీ తరఫున నాగరాజు , సాయి ప్రదీప్ , మాలతి , రామాంజనేయులు , జనసేన పార్టీ తరఫున మంజునాథ్ , తెలుగుదేశం పార్టీ తరఫున మధుబాబు నాయుడు , ఎల్.వి.ప్రసాద్ , రాజశేఖర్ రెడ్డి , వైఎస్ఆర్ సి పి తరఫున షరీఫ్ , ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బజార్అన్న , బహుజన సమాజ్ పార్టీ తరఫున నాగరాజు , అరుణ్ కుమార్ ఎలక్షన్స్ సెల్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జె. బాబు ప్రసాద్

### ఎస్పీ కి క్యాంపు కార్యాలయంలో కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ... అడిషనల్ ఎస్పీ జె. బాబు ప్రసాద్.




కర్నూలు ప్రతినిధి జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :కర్నూలు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జె. బాబు ప్రసాద్ ఇటీవల అదనపు ఎస్పీ గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ...అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన జె. బాబు ప్రసాద్ కి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, పోలీసు శాఖలో ఆయన సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 132 ఫిర్యాదులు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.



కర్నూల్ ప్రతినిధి జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :: కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

1) కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన మల్లికార్జున సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ. 3 లక్షలు తీసుకుని ల్యాప్‌టాప్ మాత్రమే నా కుమారుడి కి ఇచ్చి మోసగించాడని తుగ్గలి మండలం , పగిడిరాయి కొత్తూరు గ్రామానికి చెందిన హరీష్ చంద్ర ఫిర్యాదు చేశారు.

2)బెంగళూరులోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న మల్లు నవీన్ కుమార్ రెడ్డి రూ. 1 లక్ష 50 వేలు తీసుకుని మోసానికి పాల్పడ్డాడని, ఓర్వకల్లు మండలం, గుట్టపాడు గ్రామానికి చెందిన హరికృష్ణ చేశారు.

3) మొదటి భార్యకు ఇల్లు అగ్రిమెంట్ రాసిస్తామని హామీ ఇచ్చి, రెండో భార్య పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి, ఆ ఇంటి పై రుణం తీసుకుని మొదటి భార్య కు, పిల్లల కు అన్యాయం చేశారని , ఈ విషయం పై విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కర్నూలు మండలం, జి. శింగవరం గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు.

4) 14 సంవత్సరాల నుండి నా కుమారులు రాముడు, లోకేష్ ఆస్తిని అనుభవిస్తున్నారు. అయితే ప్రస్తుతం నన్ను, నా కుమార్తెలను పట్టించుకోవడం లేదు. నాకు 70 సంవత్సరాల వయస్సు వచ్చింది. కనీసం అన్నం కూడా పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. మాకు న్యాయం చేయాలని గోనెగండ్ల మండలం , చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన ఈరమ్మ ఫిర్యాదు చేశారు.

5) కెనరా బ్యాంకు లో మినీ బ్యాంక్ పాయింట్ నిర్వహిస్తూ, కెనరా బ్యాంకు ఉద్యోగినని చెప్పుకుంటూ అందరిని నమ్మించాడు. రైతులు , ఖాతాదారుల నుంచి పొదుపు రుణాలు , మార్ట్ గేజ్ రుణాలు మరియు ఇతర లావాదేవీల పేరుతో ప్రజల నుండి రూ. 6 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసి బ్యాంకులో జమ చేయకుండా దుర్వినియోగం చేసి , ఐపి నోటీసులు ఇచ్చి మోసం చేసి ఉడాయించిన హరి కుమార్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని సి. బెలగల్లు మండలం , కాంపాడు గ్రామంకు చెందిన నాగన్న, ఓంకార్ ఫిర్యాదు చేశారు.

6) తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఉన్న ధనలక్ష్మి యూనివర్సిటీలో మా కుమారుడు రెహాన్ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటికి వచ్చాడు. ఎందుకు వచ్చావు అని బాగా చదువుకోవాలని మందలించడంతో ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కనిపెట్టి న్యాయం చేయాలని కర్నూలు, సంపత్ నగర్ కు చెందిన సవీనా బేగం ఫిర్యాదు చేశారు.

7) కోర్టులో ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నా విత్తనం వేసిన పొలాన్ని ట్రాక్టర్ తో దున్నించి అన్యాయం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని నందవరం మండలం, కనకవీడు గ్రామానికి చెందిన నాగన్న గౌడ్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్ , రామయ్య నాయుడు , రామాంజులు పాల్గొన్నారు.

# పై వైఎస్ఆర్సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన




అమలాపురం ప్రతినిధి జూన్ 1 ఆరుణభూమి న్యూస్ :మెగాడీఎస్సీ కాదు,దగా డీఎస్సీ అంటూ వైస్సార్సీపీ నాయకులు ధ్వజం ఎత్తారు.వైస్సార్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజవర్గం ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు అనంతరంజిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థి నాయకులు బైఠాయింపు చేశారువిద్యార్థులను మెగా డీఎస్సీపేరుతో మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారుఈ సందర్భంగా వైస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం లో టీడీపీ ప్రభుత్వం నిర్వ హించిన డీఎస్సీ పరీక్షల్లో అర్హుల ఎంపిక ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవ కలు, అక్రమాలు, పారదర్శ కత లేమి నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని,అర్హత, ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం, నియామక ప్రక్రియను వివాదాస్పదం చేసి వేలాది మంది భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు.ఈ నిరసన కార్యక్రమం లో ఎమ్మెల్సీ లు కుడుపూడి సూర్యనారాయణ రావు బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, ఈ గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రామచంద్రపురం వైసిపి కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్. పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు. ఒంటెద్దు వెంకన్న నాయుడు. వైస్సార్సీపీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్. పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు సంసాని బుల్లి నాని. జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, ఉంద్రు బాబ్జి, చిక్కల రవిశంకర్ ,రాజుల పూడి మురళి.చింతా రామకృష్ణ. విత్తనాల ఇంద్ర శేఖర్. విత్తనాలమూర్తి.విద్యార్థి సంఘ విభాగాల నాయకులు. వైసీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గోనారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు
# అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

### పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలి. రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి.


### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.



కర్నూలు ప్రతినిధి జూన్ 01ఆరుణభూమి న్యూస్ : :ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవన్స్ రెడ్రెస్సల్ సిస్టం - పిజిఆర్ఎస్ ) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారంలో జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించి, తీసుకోబోయే చర్యలపై కూడా పిటిషనర్లకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత మరియు బాధ్యతాయుత వైఖరి కనిపించాలన్నారు.అదేవిధంగా ఎస్సీ కమిషన్‌కు అందిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, వాటికి సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటిఆర్) లను వెంటనే సమర్పించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమిషన్‌కు సంబంధించిన అంశాలలో ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఏడి సర్వేయర్ మురళీకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Aruna Bhumi Telugu Daily
RNI APTEL/25/A1236
అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం 02-06-2026

# ఈ సీజన్‌లో ఎక్కువగా లభించే ఈ దుంపలను అసలు విడిచిపెట్టకండి.. ఎన్నో లాభాలు పొందవచ్చు..!



కూరగాయలు, ఆకుకూరలు సాధారణంగా మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. కానీ కొన్ని రకాల కూరగాయలు మాత్రం కొన్ని సీజన్లలోనే లభిస్తాయి. అలాంటి వాటిల్లో చిలగడదుంపలు కూడా ఒకటి. వీటినే కొన్ని ప్రాంతాల్లు కంద గడ్డలు అని కూడా పిలుస్తారు. ఇవి చలికాలంలో ఎక్కువగా మనకు అందుబాటులో ఉంటాయి. అయితే పేరుకు దుంపలే కానీ ఇతర దుంపల కన్నా ఇవి చాలా భిన్నంగా ఉంటాయని చెప్పవచ్చు. ఇతర దుంపలతో పోలిస్తే పోషకాల శాతం వీటిల్లో ఎక్కువగా ఉంటుంది. కనుక ఇతర దుంపల కన్నా ఇవి మనకు ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ సీజన్‌లో లభించే చిలగడదుంపలను తరచూ తింటుంటే అనేక పోషకాలు లభిస్తాయి. ఈ దుంపలను తినడం వల్ల మనం అనేక విధాలుగా లాభాలు పొందవచ్చు.

**కంటి చూపు మెరుగు పడేందుకు..**

చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతుంది. మన శరీరంలో ఇది విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. విటమిన్ ఎ వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ దుంపలను తినడం వల్ల శరీర భాగాల్లో వచ్చే మంటలను తగ్గించుకోవచ్చు. వీటిని తింటే విటమిన్ సి అధికంగా లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గిపోతాయి.


**శ్వాసకోశ వ్యవస్థకు..**

చిలగడదుంపలను తినడం వల్ల శరీరంలో ఉండే కఫం కరిగిపోతుంది. గొంతు, ఊపిరితిత్తులు, శ్వాసనాళాల్లో ఉండే కఫం కరిగిపోతుంది. గాలి సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా వంటి సమస్యలు ఉన్నవారికి మేలు జరుగుతుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం పొందవచ్చు. బ్రాంకైటిస్ ఉన్నవారు ఈ దుంపలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. వీటిల్లో విటమిన్ సి, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి బ్రాంకైటిస్ నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఈ దుంపల్లో అధికంగా ఉండే బీటా కెరోటిన్, మెగ్నిషియం, బి విటమిన్లు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**అధిక బరువు తగ్గేందుకు..**

ఈ దుంపల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే గ్యాస్, అసిడిటీ, మలబద్దకం వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్న వారు చిలగడదుంపలను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఇక దుంపలు అయినప్పటికీ వీటిని తింటే షుగర్ లెవల్స్ ఏమాత్రం పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్ తగ్గేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు సైతం నిరభ్యంతరంగా ఈ దుంపలను తినవచ్చు. ఇలా ఈ దుంపలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# ఆస్తమా ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి.. ఉపశమనం లభిస్తుంది..!



చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

**పసుపు..**

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అల్లం..**

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**యూకలిప్టస్ ఆయిల్..**

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయం చేస్తుంది. శ్వాసనాళాల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. కఫం కరిగిపోతుంది. ఒక ఖర్చీఫ్ మీద కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి దాన్ని నిద్రించేటప్పుడు ముక్కుకు దగ్గరగా పెట్టుకోవాలి. లేదా మరుగుతున్న నీటిలో కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి అనంతరం వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. గాలి సరిగ్గా లభిస్తుంది. ఈ విధంగా పలు ఆహారాలను తీసుకుంటూ ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఆస్తమా లక్షణాలను చాలా వరకు తగ్గించుకుని ఉపశమనం పొందవచ్చు.

# యోగాంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




నంద్యాల ప్రతినిధి జూన్ 1 అరుణభూమి న్యూస్ :యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రామునాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ, శారీరక-మానసిక శ్రేయస్సు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాభ్యాసానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చే లక్ష్యంతో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జూన్ 7 నుంచి 21 వరకు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 11న శ్రీశైలం మహాక్షేత్రంలో, జూన్ 12న మహానంది దేవస్థాన ప్రాంగణంలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే జూన్ 13న జిల్లాలోని యోగా అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక యోగా సాధన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారుగతంలో జాతీయ యోగ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో 532 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ఆ మాస్టర్ ట్రైనర్ల ద్వారా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వగా, వారు ప్రజలకు యోగా శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది కూడా మరింత విస్తృత స్థాయిలో ట్రైనర్లను గుర్తించి శిక్షణ ఇవ్వడంతో పాటు, ప్రజలను పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత ఏడాది నెల రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి జూన్ 7 నుంచి జూన్ 21 వరకు 15 రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం, వార్డులో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, శిక్షణ పొందిన సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు, ప్రైవేట్ ట్రైనర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం వారు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి ప్రజలకు యోగా నేర్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి శాఖ ప్రజలను సమీకరించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వివరాలను సచివాలయ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. యోగాభ్యాసం నిర్వహించే ప్రదేశాలను ముందుగానే గుర్తించి వాటిని ఆన్‌లైన్ మ్యాపింగ్ చేయాలని, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు తదితర అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన వేడుకలను ఘనంగా నిర్వహించి, ప్రజల భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ ఆర్థిక చోదకశక్తి కేసీఆర్



2014లో తెలంగాణ ఏర్పడ్డ నాడు వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. పవర్ హాలీడేలపై పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యమిస్తున్నాయి. కరెంట్ కష్టాలతో రాష్ట్రం మొత్తం చీకటిలో మగ్గుతున్నది. ఉమ్మడి రాజధాని పేరిట హైదరాబాద్‌లో ఆంక్షలు అమలవుతున్నాయి. వలస పాలనలో 60 ఏండ్ల విధ్వంసం తర్వాత ఏది, ఎక్కడ, ఏ స్థితిలో ఉందో స్పష్టత లేని అయోమయ వాతావరణంలో కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైంది. తెలంగాణలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి రెండేండ్ల సమయం పట్టవచ్చని, అందరూ సహకరించాలని అంతకుముందు ఎన్నికల సభల్లోనే ప్రజలను కేసీఆర్ కోరారు. ఒకవైపు ఏడు మండలాలతో పాటు సీలేరు విద్యుత్తు కేంద్రాన్ని ఆంధ్రలో కలపడం, కాళ్లల్లో కట్టెలు పెట్టినట్టు విద్యుత్తు పీపీఏలను చంద్రబాబు రద్దు చేయడం వంటి అనేక సమస్యలు తొలి ప్రభుత్వానికి స్వాగతం పలికాయి. వాటన్నింటిని అధిగమించి రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే కేసీఆర్ విద్యుత్తు సమస్యను తీర్చారు. తద్వారా దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చిన తొలి రాష్ట్రంగా కీర్తి గడించారు. ఏదైనా సమస్యను పైపైన నామ్ కే వాస్తే అన్నట్టు అర్థం చేసుకుని, చూపే పరిష్కారం తాత్కాలికంగా తీవ్రతను తగ్గించినా దీర్ఘకాలికంగా ఆ సమస్య ఇంకా పెద్దదవుతుంది. కానీ, సమస్య మూలాల్లోకి వెళ్లి, కారణాలను విశ్లేషించి, మూలాల్లోంచి దాన్ని తొలగించేలా పరిష్కారం చూపితే క్రమంగా సమస్య తీవ్రత తగ్గుతుంది. కొంతకాలానికి ఆ సమస్యే కనుమరుగవుతుంది. కేసీఆర్ చేసింది ఇదే. కరెంట్ ఎప్పుడొస్తదని ఎదురుచూసే స్థితి నుంచి కరెంట్ పోతే వార్త అనే స్థాయికి తెలంగాణను తీసుకువచ్చారు కేసీఆర్. కరెంట్ కోసం ఇందిరాపార్కు వద్ద పరిశ్రమల యజమానులు ధర్నా చేసిన రోజుల నుంచి 2023 నాటికి తలసరి విద్యుత్తు వినియోగంలో జాతీయ సగటు (1,196 యూనిట్ల)ని మించి దాదాపు రెండింతలు (2,166 యూనిట్లు) పెరిగే స్థితికి చేర్చారు. ఈ ఆధునిక యుగంలో విద్యుత్తు ఒక నిత్యావసరం. మౌలిక వసతులతోపాటు డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లలో తీసుకొచ్చిన మార్పులు, క్వాలిటీని మెయింటెన్ చేయడం, గత పదేండ్లలో ఈ రంగంలో పెద్ద మొత్తంలో పెట్టిన మూలధన వ్యయంతో తెలంగాణ స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 25 వేల మెగావాట్లకు చేరుకున్నది. తెలంగాణను పవర్ బ్యాంక్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయానికి వస్తే, 2014లో రూ.40 వేల కోట్ల రెవెన్యూ ఆదాయంతో సమస్యల వలయంలో మొదలైన తెలంగాణ ప్రయాణం 2023 నాటికి రూ.1.6 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయానికి చేరింది. ఈ దశాబ్ద కాలంలో ఏ రాష్ట్రం కూడా ఇంతటి రెవెన్యూ పెరుగుదలను చూడలేదు. దీని వెనుక కఠోర శ్రమ ఉంది. కేంద్రం మద్దతు లేకుండానే, కేంద్రం పెట్టే ప్రజాకంటక విధానాలను తట్టుకొని, వారిచ్చే తాయిలాల వంటి సబ్సిడీలకు ఆశపడకుండా కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని చూసింది. బలమైన రాష్ట్రాలే బలమైన దేశానికి నాంది అని చెప్పే కేసీఆర్ ఫెడరల్ నినాదాన్ని ముందుగా తన పాలనలో, తన రాష్ట్రంలో అమలుచేసి చూపించారు. ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గ్రామాల నుంచి మండలాలకు రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు, గ్రామ గ్రామాన పల్లె ప్రకృతి వనాలు, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, సమయానికి చెరువులను నింపడం, చేప పిల్లల పంపిణీ, శ్మశానవాటికల నిర్మాణం, చెత్త సేకరణ, హరితహారం, 24 గంటల కరెంట్, చెక్ డ్యాంల నిర్మాణం, రైతు వేదికలు, గురుకుల పాఠశాలలు, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు.. ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి సాధ నాలు. ఇవే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసి రాష్ట్ర రెవెన్యూ పెరుగుదలకు దోహదపడ్డాయి. కాలంతోపాటు అర్బన్ రెవెన్యూ పెరగడం ఎక్కడైనా సహజమే. కానీ, రూరల్‌లో ఈ స్థాయిలో రెవెన్యూ పెరగడమనేది కేవలం తెలంగాణలోనే, కేసీఆర్ పాలనలోనే సాధ్యపడింది. నైపుణ్యం గల మానవ వనరులున్న తెలంగాణలో మన మాంసం అవసరాలను రాష్ట్రంలోనే తీర్చుకోలేమా? ఎందుకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద స్థాయిలో గొర్రెలను దిగుమతి చేసుకుంటున్నాం? అని కేసీఆర్ ప్రశ్నించుకున్నారు. ఆ ప్రశ్నల నుంచే గొర్రెల పంపిణీ పథకమనే సమాధానం పుట్టింది. ఆ పథకం మూలంగా రాష్ట్రంలో గొర్రెల సంఖ్యతోపాటే ఆయా వర్గాల ఉపాధి, వారి కొనుగోలు శక్తి పెరిగాయి. ఇవి రాష్ట్ర ప్రగతికి దోహదపడ్డాయి. గొర్రెల పెంపకంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. అత్యధిక తలసరి మాంసం అందుబాటులో ఉన్న రాష్ట్రంగా అవతరించింది. (29.21 కిలోలు/సంవత్సరం).

తెలంగాణ చెరువుల్లో కనుమరుగైన ఎర్ర రొయ్యలు, మంచినీటి చేపలు, చెరువులను ఎల్లప్పుడూ నీటితో నింపడం ద్వారా గ్రామీణ వ్యవస్థకు ఒనగూడే ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాల గురించి కేసీఆర్ సూక్ష్మంగా చర్చించిన సందర్భాలెన్నో. ఒక్కొక్క పని చేస్తూ, ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆయన చేసిన పనులు, తద్వారా గ్రామాల్లో జరిగిన ప్రగతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది. జనాభా ఎక్కువ ఉన్నచోట పెరిగిన మౌలిక వసతులు, ఉపాధి, సగటు గ్రామీణ తెలంగాణ కొనుగోలు శక్తే ప్రగతికి సూచికలు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌తో పాటు టైర్-2 నగరాలు, గ్రామాల్లో మూలధన పెట్టుబడిపై ఎక్కువగా దృష్టిసారించింది. అలాగే కేసీఆర్ హయాంలో సంక్షేమం కూడా అభివృద్ధికి దోహదపడే విధంగా సాగింది. సంక్షేమ పథకాలు పొందిన వర్గాల్లో మారిన వారి జీవనశైలి, పెరిగిన ఆత్మవిశ్వాసం.

# సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!



డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు, మూలధన వ్యయం అవసరాలు 30 శాతానికి పైగా పెరిగినట్టు 40 శాతం మంది ఎగుమతిదారులు నివేదించారు. ఇది వస్త్ర రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని నొక్కిచెప్తున్నది.

భారతీయ వస్త్రాలపై అమెరికా సుంకాల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు ఆర్డర్ల రద్దుతోపాటు పోటీతత్వాన్ని తట్టుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి తక్కువ సుంకం ఉన్న దేశాలతో పోటీపడుతున్నందున పెద్ద, చిన్న పరిశ్రమలు కూడా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. అంతా స్థిరపడిన తరుణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు తమ వ్యాపారాలను నాశనం చేసిందని సూరత్‌కు చెందిన జేపీ కాచివాలా కంపెనీ డైరెక్టర్ ధర్మేష్ కాచివాలా ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డాం. యూఎస్ వినియోగదారులు కోరినట్టుగా అధిక నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేస్తాం. కాబట్టి, మా పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. సుంకాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లపై దృష్టిసారించాలని ఇప్పుడు సలహా ఇస్తున్నారు. కానీ, పోటీ తీవ్రంగా ఉంది. అంతేకాదు, దేశీయ మార్కెట్ లాభదాయకం కాదు' అని ఆయన చెప్పారు. దేశంలోని వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఒక్క సూరత్‌లోనే ఉత్పత్తిలో 30-40 శాతం క్షీణత, రూ.7,200 కోట్లకు పైగా ఆదాయం కోల్పోయినట్టు అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారాలు పనిదినాలను తగ్గించుకుంటున్నాయి. డిమాండ్ పడిపోవడంతో వస్త్ర పరిశ్రమలు ప్రమాదంలో పడ్డాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ, ఇది మూణ్నాలుగు నెలల్లో తగ్గిపోతుందని కాచివాలా అంచనా వేశారు. 'మేం ఇతర ఎగుమతి మార్కెట్లను అన్వేషిస్తున్నాం. కానీ, కొత్త మార్కెట్లలో పాగా వేసేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. అమెరికాతో పోలిస్తే యూరోపియన్ మార్కెట్ల పరిమాణం చాలా తక్కువ. గత మూడు నెలలుగా మా పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు' అని ఆయన చెప్పారు. సుంకాల ప్రభావాన్ని అధిగమించడానికి ఎగుమతిదారులు గల్ఫ్, ఆగ్నేయాసియాలోనూ భారీ డిస్కౌంట్లను అందిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తి స్థావరాలను అన్వేషిస్తున్నారు. యూకేతో భారత్ చేసుకుంటున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలతో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే, అమెరికా సుంకాల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రస్తుత రుణాల చెల్లింపుపై తాత్కాలికంగా వెసులుబాటు ఇవ్వాలని, మూలధన వ్యయం కోసం పూచీకత్తు లేని రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని వస్త్ర పరిశ్రమలు కోరుతున్నాయి. ముడి పదార్థాల దిగుమతులపై ఉన్న ఆంక్షలు, దిగుమతి సుంకాలను తొలగించాలని అభ్యర్థిస్తున్నాయి. అంతేకాదు, సిబిల్ స్కోర్‌ను ప్రభావితం చేయకుండా రుణాలపై వడ్డీ మినహాయింపులను ఆశిస్తున్నాయి. ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీని ప్రకటిస్తే తాత్కాలికంగా ఊపిరి పీల్చుకుంటామని, కార్మికుల ఉపాధిని కాపాడుకోగలమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

# జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది.. చైనాపై టారిఫ్‌లను తగ్గిస్తున్నా : ట్రంప్



అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యారు. దక్షిణ కొరియా వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చైనాకు ట్రంప్ గుడ్‌న్యూస్ చెప్పారు. చైనాపై విధించిన టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. బుసాన్‌లో దాదాపు రెండు గంటల పాటూ జరిగిన భేటీలో పలు అంశాలపై ఇరువురూ చర్చించారు. ఇక భేటీ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. జిన్‌పింగ్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. అనేక అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఈ భేటీలో సోయాబీన్ కొనుగోళ్లను తిరిగి ప్రారంభించడం, అరుదైన ఖనిజాల ఎగుమతికి సంబంధించిన సమస్యలు పరిష్కారమైనట్లు ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఓ గొప్ప నేత అని కొనియాడారు. ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని ట్రంప్ వ్యాఖ్యానించారు.

Aruna Bhumi Telugu Daily RNI APTEL/25/A1236
అరుణభూమి
ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు జాతీయ తెలుగు దినపత్రిక






# వార్ 2 టీజర్: హృతిక్‌తో ఎన్టీఆర్ ధూమ్మచ్ఛాలే!

ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ టీజర్ ఏది? అంటే కచ్చితంగా అది వార్ 2 కావొచ్చు. ఎందుకంటే ఇందులో ఆర్.ఆర్.ఆర్ నటుడు ఎన్టీఆర్ నటిస్తున్నాడు గనుక! ఆర్ఆర్ఆర్ నాటు నాటుతో భారతదేశానికి ఆస్కార్ తెచ్చిన నటుడి ఇన్వాల్వ్ మెంట్ యష్ రాజ్ ఫిలింస్ వార్ 2కి గౌరవాన్ని పెంచింది. ప్రస్తుతం ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా సర్వత్రా ఉత్కంఠ పెంచుతున్న ఏకైక సినిమా వార్ 2 అనడంలో ఎలాంటి సందేహం లేదు.అందుకే అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్, ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా హృతిక్ రోషన్ ఫ్యాన్స్ తో పాటు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కళ్లు కాయలు కాసేలా వేచి చూస్తున్నారు. అయితే అలాంటి వీరాభిమానులకు అదిరిపోయే ట్రీట్ ముందుందని తాజాగా రిలీజైన టీజర్ చెబుతోంది. ముందే అంచనా వేసినట్టే టీజర్ లో యాక్షన్ కంటెంట్ పరాకష్టను ఆవిష్కరిస్తోంది. నింగి నేల ఆకాశం కాదేదీ వార్ కనర్హం! అన్న చందంగా హృతిక్, తారక్ ఒకరితో ఒకరు పోటీపడుతూ చెలరేగిపోయారు. ఆ ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడితే యుద్ధ భీభత్సం ఎలా ఉంటుందో రక్తి కట్టించేలా తెరకెక్కించారని టీజర్ నమ్మకం పెంచింది.వార్ 2 టీజర్ చూడగానే ధూమ్ ఫ్రాంఛైజీ చిత్రాలకు ఇది ఎంతమాత్రం తగ్గదని, మొన్నటికి మొన్న వచ్చిన షారూఖ్ పఠాన్ లోని యాక్షన్ కంటెంట్ కి మించి ఉంటుందని భరోసానిచ్చింది. హృతిక్ వర్సెస్ టైగర్ ష్రాఫ్ వార్ సన్నివేశాల్ని మించి, హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ యాక్షన్ సన్నివేశాల్ని అయాన్ ముఖర్జీ వర్కవుట్ చేస్తున్నాడని అర్థమవుతోంది. ముఖ్యంగా రా ఏజెంట్, బెస్ట్ సోల్జర్ హృతిక్ రోషన్ ని ఢీకొట్టేవాడిగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎంట్రీ మరో లెవల్లో వర్కవుటైంది. ఎన్టీఆర్ వేషధారణ, లుక్, కాస్ట్యూమ్స్ ప్రతిదీ ఎంతో అందంగా ఆకర్షణీయంగా కనిపించాయి. తారక్ తన లుక్ కోసం ఎక్స్ ట్రా ఎఫర్ట్ ఎందుకు పెడుతున్నాడో ఇప్పుడు వార్ 2 టీజర్ తో క్లారిటీ వచ్చేసింది. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నువ్వా నేనా? అంటూ పోటీపడుతూ హృతిక్- ఎన్టీఆర్ సృష్టించిన భీభత్సం నిజంగా రక్తి కట్టిస్తోంది. ఇండియా బెస్ట్ సోల్జర్, రా ఏజెంట్ కబీర్ తో పోటీపడేవాడిగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ట్ చేసే వార్ ఏమిటన్నది తెరపైనే చూడాలి. నీకు నేనెవరో తెలీదు! అంటూ తారక్ ఇచ్చిన ఎంట్రీ అభిమానులను వెంటాడటం ఖాయం.వార్ 2 ఇప్పుడు మోస్ట్ అవైటెడ్ చిత్రాల జాబితాలో కచ్చితంగా ఉంది. ఇది కూడా 1000 కోట్లు వసూళ్లు తేగలదు అనే నమ్మకం పెరిగింది. అయితే అయాన్ ముఖర్జీ టీజర్ ని ఎంత గ్రిప్పింగ్ గా ఆవిష్కరించారో అంతకుమించి ట్రైలర్ తో హైప్ పెంచాల్సి ఉంది. టీజర్ , ట్రైలర్ కంటే గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లేతో సినిమాని రక్తి కట్టించాల్సి ఉంటుంది. హృతిక్ ని క్రిష్ ఫ్రాంఛైజీ, ధూమ్ 2లో చూసిన ప్రేక్షకులు అంతకుమించి చూడాలనుకుంటారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ని ఆర్.ఆర్.ఆర్ కొమరం భీమ్ ని మించిన ఫోర్స్ తో చూడాలని ఫ్యాన్స్ అనుకుంటారు. దానికి తగ్గట్టే సినిమా ఆద్యంతం రక్తి కట్టించేలా రూపొందించాడని భావిద్దాం. టీజర్ ఇన్ స్టంట్ హిట్. మరి సినిమా ఏ రేంజులో ఉంటుందో వేచి చూడాలి.

# రుక్మిణికి మరో క్రేజీ ఆఫర్?



సప్త సాగారాలుదాచే ఎల్లో సెడ్ ఎ మరియు సైడ్ బి సినిమాలతో మంచి నటిగా పేరు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఓ తుఫానులా దూసుకెళ్తుంది. ఆ సినిమాలు చూశాక రుక్మిణిని ఇండియన్ సినిమా మొత్తం తమ సినిమాల కోసం లాక్ చేసుకోవాలని చూస్తోంది. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్31 కోసం రుక్మిణి ఎంపికైందని సమాచారం.దీంతో పాటూ తమిళ సినిమాలు ఏస్, మదరాసిలో కూడా రుక్మిణి నటిస్తోంది. ఇదిలా ఉంటే రుక్మిణి ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులో భాగమైనట్టు తెలుస్తోంది. థగ్ లైఫ్ సినిమా తర్వాత మణిరత్నం ఓ రొమాంటిక్ ఎంటర్టైనర్ ను చేయాలని ప్లాన్ చేసుకున్నాడట. అందులో హీరోగా నవీన్ పోలిశెట్టిని అనుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు కానీ ఆ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఎంపికైందని వార్తలొస్తున్నాయి. ఇదే నిజమైతే ప్రశాంత్ నీల్ డ్రాగన్ మూవీ షూటింగ్ టైమ్ లో రుక్మిణి కొత్త సినిమా ఒప్పుకోకూడదనే రూల్ ను తీసేయాల్సి వస్తుంది. మణిరత్నం సీన్ లోకి వస్తే ఎవరైనా రూల్స్ ను మార్చుకోవాల్సిందేనని ఈ విషయం తెలియచేస్తుంది.ఒకవేళ నిజంగా రుక్మిణి మణిరత్నం సినిమాలో నటించడం ఓకే అయితే, నీల్ తన రూల్ బుక్ ను దీని కోసం మినహాయించాల్సి వస్తుంది. అంతేకాదు ఈ వార్త నిజమైతే రుక్మిణి ఇద్దరు మోస్ట్ పవర్‌ఫుల్ డైరెక్టర్లైన మణి రత్నం మరియు నీల్ తో ఒకేసారి సినిమా చేసే ఛాన్స్ దక్కించుకున్నదవుతుంది. అయితే ఇంకా దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కన్నడ భాషతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రుక్మిణి ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేసే స్థాయికి ఎదిగింది.


# నాదన్నది ఏదీ వదలను.. అందుకే ఐటీ రైడ్స్ జరిగాయి



యాంకర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన అనసూయ ఇప్పుడు యాంకరింగ్ కు గుడ్ బై చెప్పి ఓ వైపు టీవీ షో లకు జడ్జిగా, మరోవైపు సినిమాల్లో నటిస్తూ ఆడియన్స్ ను మెప్పిస్తూ ఉంటుంది. రీసెంట్ గా అనసూయ యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహ హోస్ట్ చేస్తున్న నిఖిల్ తో నాటకాలు పాడ్‌కాస్ట్‌కు హాజరై, పలు ఇంట్రెస్టింగ్ విషయాల గురించి మాట్లాడింది.ఆడ, మగ అంటే ఎట్రాక్షన్ ఉండటం నేచురల్. సినిమా వాళ్లపై జనం ఫోకస్ ఎక్కువగా ఉంటుందని చెప్పిన అనసూయ తనకు నైన్త్ క్లాస్ లోనే ప్రపోజల్స్ మొదలయ్యాయని, అప్పటినుంచే తప్పించుకోవడం అలవాటైందని చెప్పింది. సినిమా అంటే తనకెంతో ఇష్టమని చెప్పిన అనసూయ, తన టాలెంట్ ఏంటో? తానెంత వరకు చేయగలననేది తనకు తెలుసని, డైరెక్టర్లు, రైటర్లు చెప్పే కథకు సూటవనని అనిపిస్తే తనకు తానుగా తప్పుకున్న సిట్యుయేషన్స్ ఎన్నో ఉన్నాయని అనసూయ తెలిపింది.జబర్దస్త్ లో హైపర్ ఆదితో కలిసి చేసిన స్కిట్స్ చాలానే హైలైట్ అయ్యాయని, ఆడ, మగ సంబంధాలు, ఎదురింటి పెళ్ళాంపై వేసే జోకులు జబర్దస్త్ లో ఉంటాయి. ఆ షో కు హోస్ట్ గా చేసినందుకు గర్వంగా ఫీలవుతా అని చెప్పిన అనసూయ, అక్కడి జోకులకు అనసూయ నవ్వు నటిస్తుందని, స్క్రీన్ పై కనిపించే అనసూయ వేరు, బయట కనిపించే అనసూయ వేరని, కొన్ని సందర్భాల్లో జోకుల తీవ్రత ఎక్కువైనప్పుడు తాను స్పందించిన సందర్భాలు కూడా ఉన్నాయని, కానీ షో లో ఏమేం టెలికాస్ట్ చేయాలనేది ఎడిటింగ్ రూమ్ డిసైడ్ చేస్తుందని అనసూయ తెలిపింది.గతంలో ప్రతీ గురువారం సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాలి. ఏదొక ఫోటో షూట్ ను అప్ లోడ్ చేయాలనే ఒత్తిడి ఉండేది. ఫలానా బట్టలే వేసుకోవాలి. ఇది వేసుకోకూడదనే లాంటి ఒత్తిడిలను చాలానే తట్టుకున్నానని, నన్ను నన్నుగా ఇష్టపడే వారి కోసం షోలు, సినిమాలు, డైలీ లైఫ్ లో జరిగే అంశాలను కచ్చితంగా షేర్ చేసుకుంటానని అనసూయ చెప్పింది.అనసూయకు ఇన్ని కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? 2 కోట్లు పెట్టి కారు కొనిందా అని అంటుంటారు. అలాంటి కారు కొన్నానంటే అది కేవలం నా ఒక్కదాని కష్టం కాదని, దాని వెనుక నా ఫ్యామిలీ కష్టం కూడా ఉందని అనసూయ చెప్పుకొచ్చింది. తనకెంత ఆస్తి ఉందనేది తానెప్పుడూ లెక్కలు వేసుకోలేదని, తనకు తెలిసిందల్లా హాలీడే ట్రిప్స్, ఎంజాయ్‌మెంట్స్ మాత్రమేనని అనసూయ పేర్కొంది.ఇప్పటికీ తనదొక మిడిల్ క్లాస్ హౌస్ వైఫ్ మెంటాలిటీనే అని, లైఫ్ తనకు నేర్పిన పాఠాలను చూసి ఇప్పటికీ పోపుల డబ్బాలో డబ్బులను దాచుకుంటానని చెప్పింది అనసూయ. ఆఫర్లు బాగా వచ్చి బాగానే సంపాదించానని చెప్పిన అనసూయకు జీఎస్టీ అనేది ఒకటుంటుందని తనకు తెలియదని, కొన్ని షో లకు ట్యాక్స్ కట్టకపోవడంతో పొరపాటు జరిగి తనపై ఐటీ రైడ్స్ జరిగాయని అనసూయ వెల్లడించింది.తాను, తన భర్త ఎంతో కష్టపడి నెలకు రూ. లక్షా పదహారు వేల ఈఎంఐ కడుతూ కొనుకున్న ఆడి కారును తనకెవరో ప్రొడ్యూసర్ గిఫ్ట్ గా ఇచ్చాడని ఎన్నో వార్తలొచ్చాయి. జీవితంలో పైకి రావడానికి కష్టపడతానని, నాది కానిదేదీ నాకొద్దని చెప్తున్న అనసూయ, నాదన్నది రూపాయి కూడా వదలనని చెప్తోంది. ఇక తనను ఆంటీ అనేవాళ్ల గురించి మాట్లాడుతూ తానే బట్టలేసుకుని తిరిగితే ఎవరికేం నష్టమేంటి అని ప్రశ్నించింది. పవన్ తో కలిసి వీరమల్లులో ఓ సాంగ్ లో నటించిన అనసూయ ఆయన ఎన్నో విషయాలకు నో, ఎన్నో విషయాలకు ఎస్ చెప్పబట్టే ఇవాళ ఈ స్థాయికి వచ్చారని, మెగా బ్రదర్స్ ముగ్గురూ స్వీట్ హార్ట్స్ అని వారందరితో కలిసి నటించే లక్ తనకు దక్కిందని అనసూయ తెలిపింది.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లీడ్ రోల్ లో విజయ్ కనకమేడల డైరెక్షన్ లో తెరకెక్కిన సినిమా భైరవం. సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ కి సపోర్ట్ గా నారా రోహిత్, మంచు మనోజ్ లు నటించారు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్న భైరవం సినిమాతో మరోసారి తన మాస్ స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యాడు బెల్లంకొండ శ్రీనివాస్. భైరవం ట్రైలర్ చూస్తే బెల్లంకొండ శ్రీనివాస్ ఇంటెన్స్ యాక్షన్ ఎలా ఉండబోతుందో తెలుస్తుంది.ఆల్రెడీ తను ఇదివరకు చేసిన సినిమాల వల్ల బెల్లంకొండ హీరోకి యాక్షన్ ఇమేజ్ రాగా అందుకు ఏమాత్రం తగ్గకుండా భైరవం సినిమాలో అతని క్యారెక్టరైజేషన్ పడిందని తెలుస్తుంది. భైరవం సినిమా మొన్నటిదాకా ఒక లెక్కగా ఉండగా ట్రైలర్ రిలీజ్ అయ్యాక మరింత బజ్ ఏర్పరచుకుంది. ట్రైలర్ లో బెల్లంకొండ మాస్ విధ్వంసం నెవర్ బిఫోర్ అన్నట్టుగా ఉంది.భైరవం సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ పాత్ర గురించి అతని యాక్షన్ గురించి డైరెక్టర్ విజయ్ కనకమేడల కూడా ప్రమోషన్స్ ఇంటర్వ్యూస్ లో ప్రత్యేకంగా చెప్పారు. ఈ సినిమా కోసం అతను చూపించిన డెడికేషన్ గురించి చెప్పారు. అంతేకాదు జయ జానకి నాయక, రాక్షసుడు సినిమాలు మిక్స్ చేస్తే ఎలా ఉంటుందో భైరవం సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ రోల్ అలా ఉంటుందని అన్నారు.మొత్తానికి యువ హీరోగా మాస్ ఆడియన్స్ లో మంచి క్రేజ్ తెచ్చుకున్న బెల్లంకొండ శ్రీనివాస్ భైరవం సినిమాతో మంచి అటెంప్ట్ చేశాడు. ఐతే భైరవం ప్రచార చిత్రాలన్నీ కూడా మాసీగా ఆడియన్స్ ని మెప్పించేలా ఉన్నాయి. మరి సినిమా కూడా అదే రేంజ్ లో ఉంటుందా లేదా అన్నది చూడాలి. ఈ సినిమా విషయంలో చిత్ర యూనిట్ కూడా సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. మరి ఫైనల్ రిజల్ట్ ఎలా ఉంటుందో చూడాలి. బెల్లంకొండ శ్రీనివాస్ మాస్ యాక్షన్ స్టంట్స్ హైలెట్ గా ఉంటూ మరో ఇద్దరు హీరోలైన మనోజ్, నారా రోహిత్ ఫ్యాన్స్ ని కూడా సాటిస్ఫై చేసేలా ఈ భైరవం రాబోతుంది. మరి వెండితెర మీద మాస్ బొమ్మగా ప్రేక్షకులను అలరించడానికి వస్తున్న ఈ సినిమా ఏమేరకు ఆ అంచనాలను అందుకుంటుంది అన్నది రిలీజ్ అయ్యాక తెలుస్తుంది.

# బెల్లంకొండ బలం చూపించబోతున్న భైరవం..!



# ప్రతి పునర్జన్మలోనూ నువ్వే భర్తగా రావాలి



ఒక్కడు మిగిలాడు తర్వాత మంచు మనోజ్ నుంచి మరో సినిమా వచ్చింది లేదు. ఆ సినిమా వచ్చి కూడా ఆరేళ్లవుతుంది. ఇప్పుడు ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మనోజ్ భైరవం సినిమాతో ఇండస్ట్రీకి కంబ్యాక్ ఇవ్వబోతున్నాడు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భైరవం సినిమాలో మంచు మనోజ్ కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమా మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.రీసెంట్ గా ఈ సినిమా నుంచి ట్రైలర్ రిలీజవగా ఆ ట్రైలర్ కు సోషల్ మీడియాలో విపరీతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇదిలా ఉంటే ఇవాళ మంచు మనోజ్ పుట్టినరోజు. మనోజ్ బర్త్ డే సందర్భంగా అతనికి పలువురు సెలబ్రిటీలు, ఫ్యాన్స్ విషెస్ చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మనోజ్ భార్య భూమా మౌనిక రెడ్డి కూడా మనోజ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ కొన్ని ఫోటోలను షేర్ చేసింది.నేను ప్రేమించే నా సోల్‌మేట్‌కు బర్త్ డే విషెస్. మా లైఫ్ లోకి వచ్చి, నీ లైఫ్ జర్నీని మాతో షేర్ చేసుకుంటున్నందుకు చాలా థాంక్స్. మా ప్రపంచాన్ని మీరెంతో అందంగా మార్చారు. మీరు చేసే, చేయబోయే అన్ని పనులు బాగా జరగాలి, ప్రేమ, ఆనందాన్ని పంచడానికి మీ గుండె వెయ్యేళ్లు బతకాలి. మేం నిన్నెంతగానో ప్రేమిస్తున్నాం. మా ముగ్గురి ప్రేమ మీ కోసం మాత్రమే. మీరు నిజంగా రాకింగ్ స్టార్, నా ప్రతి పునర్జన్మలోనూ నా ఫ్రెండ్ గా, భర్త గా మిమ్మల్నే ఇవ్వాలని దేవుడిని కోరుకుంటున్నా అంటూ పిల్లలతో పాటూ ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ భర్తపై ప్రేమను కురిపించింది మౌనిక.మనోజ్ భార్య మౌనిక షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. నెటిజన్లు, మంచు అభిమానులు మౌనిక పోస్ట్ ను లైక్ చేస్తూ మనోజ్ కు విషెస్ తెలపడంతో పాటూ మీ కుటుంబం ఎప్పటికీ సంతోషంగా ఉండాలని కోరుతూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే మనోజ్ భైరవంతో పాటూ తేజ సజ్జ నటిస్తున్న మిరాయ్ లో కూడా నటిస్తున్నాడు. మరి ఈ రెండు సినిమాలైనా మనోజ్ కు మంచి ఫలితాన్నిస్తాయో చూడాలి.

Editor, Printed, Published and Owned by RACHAKONDA CHANDRA SEKHAR RAO , H. NO. 14-15/3, INDIRA GANDHI NAGAR, MANDAL-VELDURTHI, KURNOOL, ANDHRA PRADESH - 518216, Printed at VSAR PUBLICATIONS , 41/1077,SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. E-mail : arunabhumi6@gmail.com. RNI : APTEL/25/A1236, Cell : +91 99899 24749